
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



శ్రీపొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

సోమవారం 27 అక్టోబరు 2025

నేడు విద్యా సంస్థలకు సెలవు

నెల్లూరు(విద్య): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సోమవారం (నేడు) అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ హిమాన్షుశుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈవోలు హెడ్ క్వార్టర్లో ఉండి కంట్రోల్ రూమ్లను ఏర్పాటు చేసుకోవాలని, హెచ్ఎంలు ఆయా పాఠశాలల్లో అందుబాటులో ఉండాలని డీఈవో బాలాజీరావు ఆదేశించారు. జూనియర్ కళాశాలలు కూడా కలెక్టర్ ఆదేశాలను తప్పక పాటించాలని ఆర్ఐవో వరప్రసాద్‌రావు తెలిపారు.

సోమశిలకు నిలకడగా వరద

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వరద నిలకడగా సాగుతోంది. ఆదివారం ఉదయం 52,129 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, సాయంత్రానికి 51,237 క్యూసెక్కులు వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దిగువకు గేట్ల ద్వారా 63,460 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 68.505 టీఎంసీల నీటిని నిల్వ ఉంచారు.

కండలేరులో అవుట్ ఫ్లో 4,400 క్యూసెక్కులు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.240 టీఎంసీలు ఉన్నదని ఏఈ అనీల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 1090 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుండగా, 4400 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా ఉందన్నారు.

రాళ్లపాడు గేట్ల ఎత్తివేత

లింగసముద్రం : రాళ్లపాడు ప్రాజెక్టు గేట్లను దశలవారీగా ఎత్తి మన్నేరుకు నీటిని విడుదల చేశారు. శనివారం అర్ధరాత్రి నీటిమట్టం 19.7 అడుగులకు చేరడంతో డీఈఈ ఎం వెంకటేశ్వర్లు, ఏఈఈ బీ మనోహర్, సిబ్బంది కొత్త స్పిల్‌వేలోని నాలుగు గేట్లను అడుగు మేర ఎత్తారు. ఆదివారం ఉదయం ఇన్‌ఫ్లో తగ్గడంతో రెండు గేట్లను దించారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, నీటి మట్టం 18.5 అడుగులు ఉన్నట్లు అధికారులు చెప్పారు. కాగా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదివారం సాయంత్రం రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించారు. నీటినిల్వ గురించి డీఈఈ ఎం వెంకటేశ్వర్లును అడిగారు.

తగ్గిన పెన్నా వరద

సంగం : సంగం బ్యారేజీకి వస్తున్న పెన్నా వరద ఆదివారం కాస్త తగ్గింది. 94 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహమే వస్తున్నది. దీంతో ప్రస్తుతం బ్యారేజ్ వద్ద నీటి మట్టం 11.6 అడుగులుగా ఉంది. దీంతో వచ్చిన నీటిని వచ్చినట్లే బ్యారేజ్ 79 గేట్లు ఎత్తి పెన్నాకి విడుదల చేస్తున్నారు.



రాళ్లపాడు ప్రాజెక్టులో నాలుగు గేట్లు ఎత్తి మన్నేరుకు విడుదల చేసిన నీరు



సంగం : రాకపోకలు స్తంభించిన వీర్లగుడిపాడు గ్రామస్థులతో చర్చిస్తున్న అధికారులు

ముంచుకొస్తున్న మొంథా

- నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- 144 పునరావాస కేంద్రాల ఏర్పాటు
- సహాయక చర్యలకు రూ.2 కోట్లు విడుదల
- జిల్లా ప్రత్యేకాధికారిగా సీనియర్ ఐఏఎస్ యువరాజ్
- డివిజన్ల వారీగా కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- నేడు విద్యాసంస్థలకు సెలవు

నెల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు మొంథా తుఫాన్ ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి, తుఫాన్‌గా మారి రాష్ట్రం వైపు దూసుకొస్తోంది. సోమ, మంగళవారాల్లో జిల్లాపై ఈ ప్రభావం తీవ్రంగా పడనున్నట్లు వాతావరణశాఖ హెచ్చరించింది. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని అలెర్ట్ చేసింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో సమీక్షిస్తున్నారు. జిల్లాలో 9 తీర ప్రాంత మండలాలు తుఫాన్ ప్రభావానికి ప్రభావితమయ్యే అవకాశమున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తీసుకెళ్లేందుకు వీలుగా జిల్లా వ్యాప్తంగా 144 రిలీఫ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు ఆహారానికి ఇబ్బంది లేకుండా 377 రేషన్ దుకాణాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అలానే 82 డీసెంట్రలైజ్డ్ రైతు బజార్లను కూడా ఏర్పాటు చేశారు. విజయ డెయిరీ ద్వారా అంతరాయం లేకుండా పాల సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

● విపత్తు బృందాల రాక

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో నష్టనివారణకు ప్రభుత్వం రెండు విపత్తు నిర్వహణ బృందాలను జిల్లాకు పంపింది. ఒకటి ఎన్డీఆర్ఎఫ్ బృందం కాగా, మరొకటి ఎస్డీఆర్ఎఫ్ బృందం. వీటిని నెల్లూరు, కావలి ప్రాంతాల్లో ఉంచారు. ఇక తుఫాన్ సమయంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన అధికార యంత్రాంగం.. వారంలో ప్రసవం జరిగే అవకాశమున్న 312 మంది గర్భిణులను ఆసుపత్రులకు తరలించింది. తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి పథకాలు, ఓవర్ హెడ్ ట్యాంకుల వద్ద పవర్ బ్యాకప్‌లను అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా వ్యాప్తంగా 800 వాటర్ ప్లాంట్లను సిద్ధంగా ఉంచారు. ఇక జాతీయ, రాష్ట్ర రహదారుల్లో 27 ప్రదేశాలు, రైల్వే మార్గాల్లో 16 ప్రదేశాలు వరదలకు దెబ్బతినే ప్రమాదముందని గుర్తించారు. ఒకవేళ అక్కడ వరద ప్రభావం ఉంటే అందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. పెన్నా పరివాహకంలో 40 సున్నిత ప్రదేశాలను గుర్తించి అక్కడ పొర్లుకట్టలకు మరమ్మతులు చేస్తున్నారు. అలానే సెల్‌ఫోన్ నెట్‌వర్క్ కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లాలోని 2100 మొబైల్ టవర్స్ దగ్గర పవర్ బ్యాకప్ సిద్ధం చేసుకోవాలని సూచించారు.

● ప్రత్యేకాధికారిగా యువరాజ్

తుఫాన్ నేపథ్యంలో జిల్లాకు ప్రత్యేకాధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్ యువరాజ్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన సోమవారం నుంచి జిల్లాలో ఉంటూ తుఫాన్ నివారణ చర్యలను పర్యవేక్షించనున్నారు. కాగా జిల్లాలోని అన్ని మండలాలకు కలెక్టర్ ప్రత్యేకాధికారులను నియమించారు. వారంతా ఆయా మండల హెడ్ క్వార్టర్స్‌లో ఉంటూ నివారణ చర్యలను పర్యవేక్షించనున్నారు. కాగా ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు కూడా రద్దు చేశారు. ఇక తుఫాన్ సమయంలో సహాయక చర్యల కోసం ప్రభుత్వం జిల్లాకు రూ.2 కోట్ల నిధులను కేటాయించింది.

● కరేడు తీరాన్ని సందర్శించిన ఎస్పీ

ఉలవపాడు : తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కరేడు తీర ప్రాంతాన్ని ఎస్పీ అజిత వేజెండ్ల ఆదివారం పరిశీలించారు. ముందస్తుగా చేపట్టిన సౌకర్యాలు, భద్రత విషయాలపై పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తీరం వెంట గట్టి నిఘా పెట్టాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ అన్వర్ బాష, స్పెషల్ బ్రాంచ్ సీఐ వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్సై అంకమ్మ తదితరులు ఉన్నారు.



జలదంకి మండలం నేరెళ్లవాగు చప్టాపై నీటి ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, తదితరులు



తుఫాన్ ప్రభావిత కరేడు తీరప్రాంతంలో పర్యటించిన ఎస్పీ అజిత వేజెండ్ల, సిబ్బంది

డివిజన్ల వారీగా కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

నెల్లూరు(హరనాథపురం) : మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలోని డివిజన్ల వారీగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదివారం ప్రకటనలో తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్‌లో 0861-2331261, 79955 76699, కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం 76010 02776, నెల్లూరు ఆర్డీవో కార్యాలయం 98499 04061, ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయం 91009 48215, కావలి ఆర్డీవో కార్యాలయంలో 77022 67559 నంబర్లను వినియోగించుకోవాలని కోరారు.

'పునాస'కు వర్షాల దెబ్బ

- తోటల్లో నిలిచిన నీరు... కోతకు ఆటంకం
- చెట్లపైనే పండి, రాలిపోతున్న కాయలు
- నష్టాల ఊబిలో మామిడి రైతులు



రంగు మారిన పునాస మామిడి కాయలు

ఉలవపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలతో పునాస మామిడి రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. చేతికి వచ్చిన పంట చెట్లకే పరిమితమైంది. ముందస్తుగా కాచిన కాయలు కోతకు వచ్చే క్రమంలో వారం నుంచి వర్షాలతో తోటల్లో నీళ్లు నిలిచి, కాయ కోతలకు ఆటంకం ఏర్పడింది. దీంతో కాయలు పక్వానికి వచ్చి పండి చెట్ల కిందే రాలిపోతున్నాయి. ఈనెల నుంచి జనవరి వరకు పూతలు, పిందెలు, ముందస్తుగా కాసిన కాయల కోతలతో పునాస మార్కెట్ కళకళలాడుతుంది. గత సీజన్‌లో బంగినపల్లి మామిడిలో భారీగా నష్టాలు చవిచూసిన రైతు, పునాస మామిడిలోనైనా ఆ నష్టాన్ని పూడ్చుకుందామనుకున్న ఆశలు వారి ఆశలను భారీ వర్షాలు చిదిమేశాయి.

● కోతకు అనుకూలించని వాతావరణం

అందుబాటులో ఉన్న నాణ్యమైన కాయలు కోసి మార్కెట్‌కు తరలిద్దామనుకుంటే వాతావరణం అనుకూలించడం లేదని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. వర్షం ఇంతటితో ఆగిపోయి, ఒకటి రెండు రోజులు బాగా ఎండలు కాస్తే పునాస కోతలు మొదలు పెట్టుకోవచ్చని వారంటున్నారు. ఈ క్రమంలో మళ్లీ అల్పపీడనం హెచ్చరికతో నాలుగైదు రోజులు వర్షాలు తప్పవని అంటున్నారు. దీంతో భారీగా నష్టాలు చూడాల్సి వచ్చిందని రైతులు అంటున్నారు. కాగా భారీ వర్షాలకు చెట్లకు ఉన్న పూత తుడిచిపెట్టుకుపోతున్నదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మామిడి తోటలో నిలిచిన నీళ్లు

● తగ్గిన ధరలు

ఏదో ఒక రకంగా కాయల కోతలు చేపట్టిన రైతుకు రేటు విషయంలో నిరాశే ఎదురైంది. వర్షాలకు కాయల రంగుమారి, నాణ్యత దెబ్బతినడంతో మార్కెట్‌లో రేటు పడిపోయింది. నాణ్యమైన కాయలను కిలో రూ.20 కొనుగోలు చేస్తుండగా, రంగు మారడంతో కిలో రూ.10 కొంటున్నట్లు రైతులు చెప్తున్నారు. కొన్ని తోటల్లో రవాణా సౌకర్యం కష్టతరంగా ఉన్నా, రైతు ప్రయాసపడి మార్కెట్‌కు కాయలు తరలిస్తున్నారు.

ట్రావెల్స్ బస్సులో పొగలు

- భయాందోళనలతో ప్రయాణికుల కేకలు



పొదలకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం కర్నూలు జిల్లాలో జరిగిన ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటనను మరువక ముందే.. పొదలకూరు మండలంలో శనివారం రాత్రి మరో ట్రావెల్స్ బస్సు ప్రయాణికులను ఆందోళనకు గురిచేసింది. పొదలకూరు నుంచి శనివారం రాత్రి 11 గంటలకు 15 మంది ప్రయాణికులతో బెంగళూరు ప్రైవేటు ట్రావెల్స్ బస్సు (మిగతా 5లో...)

నవీకరణకు అవకాశం

- విద్యార్థులకు ఆధార్ ఎంతో కీలకం
- పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలు
- 30లోగా అప్‌డేట్ చేయించుకోవాలి



నెల్లూరు(విద్య), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో కీలకమైన ఆధార్‌ను అప్‌డేట్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. పోటీ పరీక్షలకు హాజరవ్వాలన్నా, ప్రభుత్వ పథకాలు వర్తించాలన్నా, ఇతర ఏ లబ్ధి పొందాలన్నా కూడా ఆధార్ నవీకరణ ఎంతో అవసరం. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు ఎదిగే విధానంలో వారి వేలిముద్రలు, ఇతర బయోమెట్రిక్ లక్షణాలు మారుతుంటాయి. ఆయా వివరాలను పక్కాగా నమోదు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ అప్‌డేట్‌ను తప్పనిసరి చేసింది. ఇందులో భాగంగా విద్యార్థులంతా కూడా ఆధార్‌ను నవీకరించుకోవాలని పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈనెల 30లోగా ప్రతిఒక్కరూ అప్‌డేట్ చేయించుకోవాలని తెలిపింది.

● పాఠశాలల్లో అవకాశం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆధార్‌ను నవీకరిస్తున్నారు. ప్రతి ఐదేళ్లకు చిన్నారులు ఆధార్ అప్‌డేట్ చేయాలన్నది నిబంధన. జిల్లాలో 5 నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులు 45,493 మంది, 15 ఏళ్ల పైబడినవారు 38,638 మంది కలిపి మొత్తం 84,131 మంది విద్యార్థులు ఆధార్ నవీకరించుకోవాల్సి ఉంది. వీరికోసం జిల్లా వ్యాప్తంగా స్కూల్ కాంప్లెక్స్‌లలో 85 ఆధార్ నవీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో వార్డు సచివాలయాల్లో ఆధార్ నవీకరణ సౌకర్యం కల్పించినప్పటికీ రోజుకు కొంతమంది మాత్రమే రావాలని, అది కూడా సచివాలయం పనివేళల్లో మాత్రమే చేస్తామని నిబంధన పెట్టారు. దీంతో అధికశాతం విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేయించుకోలేకపోయారు. దీంతో ప్రభుత్వం పాఠశాలల్లోనే కేంద్రాలను ఏర్పాటు చేసి, ఈనెల 30 నాటికి అప్‌డేట్ పూర్తి చేయాలని ఆదేశించారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని 85 స్కూల్ కాంప్లెక్స్‌ల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. నవీకరణకు సిబ్బంది అందరూ సిద్ధంగా ఉంటారు. తల్లిదండ్రుల ఆధార్, రేషన్‌కార్డు, పాన్‌కార్డులు తదితర గుర్తింపు కార్డులతో విద్యార్థులు హాజరు కావాలి. తప్పనిసరిగా నవీకరణ చేయించుకోవాలి. వర్షాలు కురుస్తూ ఉంటే గడువును మరికొన్ని రోజులు పొడిగించే అవకాశం ఉంది.

- డాక్టర్ ఆర్.బాలాజీరావు, డీఈవో

యూరియాపై నియంత్రణ

- విచ్చలవిడిగా వాడకానికి చెల్లుచీటి
- రబీలో కొరత తీరేనా..?
- రైతులందరికీ అందేనా...



అల్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ ప్రారంభం కానుండడంతో జిల్లాలో యూరియా వాడకంపై నియంత్రణకు అధికారులు సిద్ధమయ్యారు. తక్కువ ధరలో దొరుకుతుందని, యూరియాను ఎంత వినియోగిస్తే పైర్లు అంత బాగా ఎదుగుతాయనే భావనతో రైతులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. కొంతమంది రైతులు అవగాహనా లోపంతో సీజను ప్రారంభం నుంచి ముగింపు వరకు ఎకరానికి ఆరుబ్యాగుల (300 కిలోలు) యూరియాను వినియోగిస్తున్నారు. అది భూమిలో కరిగి మొక్కకు అందించేది కేవలం 60 నుంచి 80 కిలోల మాత్రమే. దీన్ని బట్టి యూ రియా అవసరానికంటే రెండు రెట్లు అధికంగా వినియోగిస్తుండగా, కొరత ఏర్పడుతున్నది. ఈ పరిస్థితిని గాడిలో పెట్టేందుకు అవసరమైన మేరకే యూరియాను వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.అయితే ఈ సీజన్‌లో అవసరమైన మేరకు యూరియా అందేనా...అని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

● యూరియా పంపిణీకి కార్డు


యూరియా పొందాలంటే అధికారులు పంపిణీ చేసే యూరియా పంపిణీ కార్డును పొందాలి. దీన్ని మండలాల వ్యవసాయాధికారుల వద్ద తీసుకోవాలి. దీని ద్వారా ఎకరానికి 3 బ్యాగులను మాత్రమే తీసుకునే వీలుంది. మూడు బ్యాగులు వినియోగిస్తే రబీ సీజనుకు సరిపోతుందని రైతులకు తెలిపేందుకు అధికారులు ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ కార్డులో రైతు పేరు, ఆధార్ నెంబరు, సాగు విస్తీర్ణం వివరాలను పొందు పరుస్తారు. అందుకు అనుగుణంగా యూరియాను పొందవచ్చు. సొసైటీల్లో కానీ, డీలర్ల వద్ద కానీ ఈకార్డు ఉంటేనే యూరియా పొందే అవకాశం ఉంది. రబీ సీజనులో ప్రతీ 15 రోజులకోసారి యూరియా పొందేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

● విస్తీర్ణానికి అనుగుణంగా నిల్వలు

ఒక్కొక్క మండలంలో ఎంత విస్తీర్ణంలో వరిసాగు చేపడుతున్నారనే గణాంకాలను బట్టి యూరియాను నిల్వ ఉంచేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఉదాహరణకు అల్లూరు మండలంలో 22 వేల ఎకరాలు ఉందనుకుంటే 66 వేల బస్తాలు మాత్రమే నిల్వ ఉంచేలా చూస్తున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా 5 లక్షలు అనధికారికంగా వరిసాగు చేపడుతుంటే అందుకు అనుగుణంగా యూరియా నిల్వలు ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు.

● రబీలో సమస్య తలెత్తనుందా...?

రబీలో యూరియా పంపిణీ సమస్యాత్మకం కానుందా... యూరియా కొరత ఏర్పడనుందా...? ఇలా అనేక అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. కొరత ఏర్పడకుంటే ఈ నిబంధనలు ఇప్పుడెందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. తమ అనుమానాలను నివృత్తి చేయాలని వారు కోరుతున్నారు.



నూతన విధానంపై ఆందోళన



వరిసాగులో అత్యధికంగా యూరియా వినియోగం సర్వసాధారణం. నూతన విధానంపై ఆందోళనగా ఉంది. నియంత్రించేందుకు చేపట్టే ఈ చర్య రైతులకు సమస్యగా మారకుండా ఉండాలి.

- మోమిడి మాధవరావు, రైతు, అల్లూరు

నియంత్రిస్తే ఎలా...?



ఎకరాకు మూడు బ్యాగులు ఇస్తే సాగు ఎలా పూర్తవుతుంది. కాంప్లెక్స్ ఎరువులు ధరలు ఆకాశాన్నంటుతున్న క్రమంలో పేదరైతులు యూరియాపై ఆధారపడి సాగు చేస్తారు. పెద్ద రైతులకు పలుకుబడితో యూరియా ఇచ్చేసి పేద రైతులకు నిబంధనలు పెడితే ఎలా..?

- యరటపల్లి శేఖర్ రెడ్డి, రైతు, అల్లూరు.

ఉన్నతాధికారుల ఆదేశాలతో కార్డుల పంపిణీ



యూరియా విచ్చలవిడి వినియోగానికి అడ్డుకట్ట వేసి, రైతులకు నష్టం వాటిల్లకుండా చూసేందుకు ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. వారి సూచనల మేరకు యూరియా పంపిణీ కార్డులు అందజేస్తున్నాం. రైతులంతా మా కార్యాలయంలో సంప్రదించి, కార్డులు పొందాలి.

- వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి, అల్లూరు

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100) : 575

బంగారం, వెండి ధరలు
బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.11,860
వెండి కిలో ధర రూ. 1,54,000
వెండి ఒక గ్రాము రూ.160.00

డీఎస్సీ విజేతలకు అభినందన

నెల్లూరు(విద్య), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో విజయం సాధించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం విద్యార్థులు పుష్ప, మురళిని సర్వోదయ కళాశాల కరస్పాండెంట్ రమణారెడ్డి అభినందించారు. ఆదివారం కళాశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ నిబద్ధతతో శ్రమిస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. డీఎస్సీకి ఎంపికైన ఇద్దరు ఉపాధ్యాయులుగా ఉత్తమ సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రీజనల్ కోఆర్డినేటర్ ఎం పిచ్చ య్య, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ రజనీకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

తాతయ్య ప్రేరణతో కవిత్వం

విశ్రాంత ఐపీఎస్ అధికారి, మాజీ డీజీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి



ఉగ్రవాదులను సంఘ విద్రోహులను, కరుడుకట్టిన నేరగాళ్లను ఖాకీ క్రౌర్యంతో అణిచి వేసిన ఐపీఎస్ అధికారి, మాజీ డీజీపీ కొత్తకోట శ్రీనివాస రెడ్డి. తుపాకీ పట్టిన చేత్తోనే కలం పట్టిన ఆయన పదవీ విరమణ చేసిన తర్వాత తాను రచించిన కవితలను పుంజుతోక కవితా సంపుటి పేరుతో ఒక పుస్తకంగా వెలువరించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తొలి బాధ్యతలు నెల్లూరు జిల్లాలో చేపట్టిన ఆయన తన తొలి కవితా సంపుటిని కూడా నెల్లూరులోనే ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తన అంతరంగాన్ని ఆంధ్రజ్యోతితో ఆవిష్కరించారు. అవి ఆయన మాటల్లోనే..

తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించాను. ఊరిపేరే ఇంటి పేరయ్యింది. జిల్లాలో ఎస్పీగా శాంతి భద్రతలకు చేసిన సేవలు కొద్దిగానే అయినా జిల్లా ప్రజల నుంచి కొండంత అభిమానాన్ని పొందాను. అటువంటి ఆత్మీయుల మధ్య నా తొలి కవితా

అతిథి అంతరంగం

సంపుటి ఆవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉంది. పుంజుతోక కవితా సంపుటి ఏకకాలంలో రాసిన కవితలు కావు. ఎస్పీగా, వివిధ హోదాల్లో పోలీసు డ్యూటీ చేస్తున్న సమయంలో అప్పుడప్పుడు రాసుకున్న కవితలు 125. వాటిని పుస్తకంగా అచ్చు వేయించాను. రచయితగా నాకు ప్రేరణ మా తాతయ్య. ఆయన తిక్కన, ఇతర కవుల సాహిత్యాన్ని ఆశువుగా చెప్పడం విని, బాల్యం నుంచే తెలుగు భాష, సాహిత్యంపై అభిరుచి పెంచుకున్నాను. విద్యార్థి దశ నుంచే కవితలు రాశాను. కళాశాలలో చదువుకునే రోజుల్లో సాహిత్య విభాగానికి అధ్యక్షుడిగా పనిచేశాను. కవితలు రాయడమే కాక సహచర విద్యార్థులతో రచనలు చేయించేందుకు ప్రోత్సహించాను. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కొంత కాలం అధ్యాపకుడిగా పనిచేసి తర్వాత ఐపీఎస్ చేశాను. విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ రచనలు, విశాలాంధ్ర ప్రచురణలు చదవడం నన్ను కవిని చేసింది. పుంజుతోక కవితా సంపుటిలో పోలీసు సిబ్బందిపై ఓ కవిత రాశాను. పోలీసులకు అది ప్రేరణ ఇస్తుంది. పోలీసు ఉద్యోగం అంటే ప్రజలకు సేవ చేయడం. బదిలీలు, పనిష్మెంటు కాదు. జిల్లాలో 15నెలలు ఎస్పీగా పనిచేశారు. నా సర్వీసులో ఎక్కడా ఆరు నెలలకు మించి పనిచేయలేదు. నీతి నిజాయితీ, నిబద్ధత, శాంతిభద్రతల పరిరక్షణకే ప్రాధాన్యతనిచ్చాను. నాకు రచనలపైనే ఆసక్తి రాజకీయాలపైన కాదు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

ప్రత్యామ్నాయం... ప్రమాదకరం



నగర సమీపంలోని పొట్టేపాళెం కలుజు వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. సుమారు 300 క్యూసెక్కుల వరద పారుతుండటంతో కలుజుపై ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అధికారులు ప్రత్యామ్నాయంగా పక్కనే తూములేసి రోడ్డుని నిర్మించారు. అదికాస్తా తాజా వర్షాలకు పాడై ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు కాస్త పట్టించుకుని రోడ్డును ఆధునీకరించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- నెల్లూరు రూరల్,(ఆంధ్రజ్యోతి)

కార్తీక లక్ష దీపోత్సవానికి గుంజ ప్రతిష్ఠ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో జరిగే 10వ కార్తీక లక్ష దీపోత్సవ ఏర్పాట్ల ప్రారంభానికి ఆదివారం వీఆర్ హైస్కూల్‌లో గుంజ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిగింది. దీపోత్సవం నవంబరు నెల 6, 7, 8 తేదీలలో జరుగుతుందని వీపీఆర్ దంపతులు తెలిపారు. ఈ మేరకు కార్యక్రమాల బ్రోచర్లు ఆవిష్కరించారు. 6వతేదీ రాత్రి చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం జరుగుతుందన్నారు. 7వ తేదీ సచ్చిదానంద సరస్వతీ, చివరి రోజు రామానందభారతీ మహాస్వామి అనుగ్రహ భాషణం చేస్తారని తెలిపారు. నాగేశ్వర జ్యోతిర్లింగ ఆలయం నమూనా, పండరినాథ్ దేవాలయం నమూనా ఆలయాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌శర్మ, ప్రభాకర్‌రావు, సునీల్‌కుమార్, విజయసారథి, వంశీకృష్ణారెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, ఉచ్చి భువనేశ్వరీప్రసాద్, గుడి హరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీఆర్ హైస్కూలు మైదానంలో గుంజ ప్రతిష్ఠ చేస్తున్న వీపీఆర్ దంపతులు

వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ భూమి పూజ ఏర్పాట్లు : మంత్రి ఆనం పరిశీలన

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేటలో గల రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ ఏర్పాట్లను ఆదివారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరిశీలించారు. ఈ భూమి పూజ కార్యక్రమం ఈ నెల 29వ తేదీన ఉదయం 11:18 గంటలకు త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా జరుగుతుందని మంత్రి ఆనం తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు, ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్‌కు సత్కారం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వర ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జనసేన నాయకుడు కొట్టే సాయిని ఆ పార్టీ జిల్లా నాయ కులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. మల్లి కార్జున యాదవ్, కిషోర్, వర్షాచలం రాజేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఫ్యూచర్ లెర్నింగ్ ఏఐపై అవగాహన

నెల్లూరు(విద్య), అక్టోబరు 26 (ఆంధ్రజ్యో తి) : ఎంఎస్ఆర్ సంస్థ ఆధ్వర్యంలో ఫ్యూచర్ లెర్నింగ్ ఏఐపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమం లో ఆ సంస్థ సీఈవో నరేంద్ర రెడ్డి మాట్లాడు తూ ఏఐ, ఎంఎల్, ఎస్ఎల్ టెక్నాలజీ ద్వారా 6 నుంచి 10వతరగతి వరకు విద్యార్థులు ఇత ర వ్యాపకాలకు వెళ్లకుండా చదువుపైనే దృష్టి కేంద్రీకరించేలా ఎప్పటిక ప్పుడు తల్లిదండ్రు లు, ఉపాధ్యాయులకు నోటిఫికేషన్ పంపుతూ అప్రమత్తం చేస్తుందని చెప్పారు. వంద శా తం డేటాను అందించడంతోపాటు అందరికీ అందుబాటులో ఉండేలా దీనిని సిద్ధం చేశా మన్నారు. అనంతరం తల్లిదండ్రుల సందేహా లను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐ టెక్నాలజీ నిపుణుడు తౌసీఫ్ అహ్మద్, ఆపరేష న్ మేనేజర్ దేవదాస్, పలువురు కరస్పాండెం ట్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్తీక ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వ రస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, భువనేశ్వరీ అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. రాత్రి భారీ సంఖ్యలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఈ సందర్భంగా పుష్పాలంకరణ ఆకట్టుకుంది. అనంతరం శివపార్వతులకు ప్రాకారోత్సవం జరిగింది. ఈవో శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

దుప్పట్లు, ఆట వస్తువుల వితరణ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పొదలకూరు రోడ్డులో గల వియానీ హోంలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులకు ఆదివారం దుప్పట్లు, ఆట వస్తువులు వితరణ చేశారు. అమెరికాలో ఉంటున్న లహరి జన్మదినం సందర్భంగా ఆమె తల్లిదండ్రులు రమేష్, లావణ్య ద్వారా లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రతిభ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థిని స్పందన నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రూపేష్, కార్యదర్శి నరేంద్ర, ట్రెజరర్ నారాయణ, ఫౌండర్ రామ్మోహన్, సభ్యులు పాల్గొన్నారు.

మన చదువుల్లో భాషకు స్థానం లేదు

● పుంజుతోక కవితా సంపుటి ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్సీ విఠపు



పుంజుతోక పుస్తకావిష్కరణ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం, విశ్రాంత డీజీపీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 'ప్రస్తుతం మన చదువుల్లో భాషకు స్థానంలేదు...కానీ పరీక్షల్లో 99 శాతం మార్కులు వస్తున్నాయి' అని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి నగరంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరంలో మాజీ డీజీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి రచించిన పుంజుతోక కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా విఠపు మాట్లాడుతూ కార్పొరేట్, ఇతర విద్యా సంస్థల్లో భాష పట్ల సీరియస్‌నెస్ పూర్తిగా తగ్గిపోయిందని తెలిపారు. 30 ఏళ్ల పరిపాలన సాగించి, నిజాయితీకి నిలువుటద్దంగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన కలెక్టర్లు ఎస్ఆర్.శంకరన్, సుజాతరావుల కోవలోనే శ్రీనివాసరెడ్డి పయనిస్తున్నారని తెలిపారు. శ్రీనివాసరెడ్డి రాసిన కవితలు వినడానికి కాదు.. ఆయనపై ఉన్న అభిమానంతోనే ఇంతమంది వచ్చారని విఠపు తెలిపారు. కొత్తకోట శ్రీనివాసులురెడ్డిలో ఖాకీ లాఠీలే కాదు... మాతృభాషపై అభిమానం, మధ్య తరగతి సమాజం పట్ల అభిమానాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం పుంజుతోక కవితా సంపుటిని శతాధిక గ్రంథకర్త డాక్టర్ జీవీ.పూర్ణచంద్, సాహితీ విమర్శకులు డాక్టర్ మేడేపల్లి రవికుమార్, రచయిత్రి చంద్రలత,ప్రముఖ పాత్రికేయులు నెల్లూరు డోలేంద్ర తదితరులు ఆవిష్కరించారు. డైట్ కళాశాల లెక్చరర్ శైలజ పుస్తక సమీక్ష చేశారు. అనంతరం రచయిత శ్రీనివాసరెడ్డికి ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తనను సమర్థవంతమైన అధికారిగా తీర్చిదిద్దిన నెల్లూరు ప్రజల సమక్షంలో తన తొలి కవితా సంపుటి ఆవిష్కరణ జరగడం, వారి ఆశీస్సులు అందుకోవడం చెప్పలేని ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, నగర ప్రముఖులు అమరావతి కృష్ణారెడ్డి, అల్లూరి రహీమ్, గుమ్మడి శ్రీనివాసులురెడ్డి, చిన్ని నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

నమ్మిన ప్రజలకు మేలు చేద్దాం..

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



నాయకులకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అధికారమిచ్చిన ప్రజలకు మేలు చేసేందుకు అందరూ కలిసి ముందుకురావాలని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన కార్యాలయంలో నగరంలోని 26, 38 డివిజన్ల నుంచి వైసీపీకి చెందిన కనకట్ల మోహన్‌రావు, షేక్ సందానీ బాషా బృందాలు టీడీపీలో చేరాయి వారికి పార్టీ కండువా కప్పి స్వాగతించారు. రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నియోజక వర్గాల్లో నెల్లూరు రూరల్ ఒకటన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ పాల్గొన్నారు. కాగా, కోడూరుపాడు వద్ద పెన్నా పొర్లుకట్టల వల్ల ఎలాంటి విపత్తు ఏర్పడినా ప్రజలకు ఇబ్బంది రానివ్వకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు గిరిధర్‌రెడ్డి తెలిపారు. టీడీపీ సీనియర్ నేత కోడూరు కమలాకర్‌రెడ్డితో కలిసి పెన్నా కరకట్టలను ఆయన పరిశీలించారు.

మాజీ డీజీపీతో భేటీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మాజీ డీజీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిని నగరంలోని మాగుంటలేవుట్‌లో ఆదివారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పలు విషయాలు చర్చించి ఆయనను సత్కరించారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. కమిటీ సభ్యులు గంపల మంజుల మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం విద్యార్థులకు మహాత్మాగాంధీ ఆశయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమంపై సోమిరెడ్డి ప్రత్యేక దృష్టి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రమేష్‌కుమార్

ముత్తుకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని టీడీపీ తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొత్తపల్లి రమేష్ కుమార్ తెలిపారు. ఆదివారం బ్రహ్మదేవం సబ్‌స్టేషన్ ఎదురుగా నివాసం ఉంటున్న గిరిజనులకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చేయూతతో ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలంలో గిరిజనులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఇటీవల దీపావళికి టపాసులు, స్వీట్లు అందజేశారన్నారు. పారిశ్రామికవేత్తల సహకారంతో ఎమ్మెల్యే గిరిజన కాలనీలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, దయాకర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

సంగం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెంలో జనసేన పార్టీ నాయకులు దాడి భాను కిరణ్ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. టిడ్కో రాష్ట్ర చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సూచనల మేరకు చదలవాడ హరీష్ కుమార్ సహకారంతో బియ్యం, పప్పులు, చింత పండు, ఇతర సామగ్రిని అందచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

సంధ్యా కాంతుల్లోన.. పెన్నా తీరంలోన..!





సంధ్యా సమీరంలో అలల పాన్పుపై
సూరీడు సేదదీరే స్వర్ణ కాంతుల రవళి!
'పెన్న'మ్మ తీరాన.. కోవూరు పర్యాటకుల
కమ్మని ముచ్చట్ల.. మధురానుభూతుల జావళి!

కోవూరు (ఆంధ్రజ్యోతి)

'హృదయ' లోగిలిలో ప్రవహించే పాల నురగల
సెలయేటి పాటల తరంగాల శబ్ద సౌందర్యం!
శాశ్వతంగా చరవాణిలో బంధించిన తియ్యని జ్ఞాపకం!
(కోవూరు-నెల్లూరు రహదారిలో పెన్నానది సౌందర్యం)

దళితుల ఆత్మగౌరవ ర్యాలీకి తరలిరండి!

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1వ తేదీన హైదరాబాద్‌లో జరిగే దళితుల ఆత్మగౌరవ మహా ర్యాలీని జయప్రదం చేయాలని జిల్లా ఎంఎస్పీ అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాదిగ పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆదివారం రేబాలలో జరిగిన సమావేశంలో కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమరిక రమణయ్య ఎంఎస్పీ సీనియర్ నాయకుడు దర్శిగుంట శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

యమ డేంజర్!



గూడూరు హైవేపై వర్షాలకు దెబ్బతిన్న వంతెన

మనుబోలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హైవేపై నిత్యం ప్రయాణించే ప్రయాణీకులరా జర జాగ్రత్తగా వెళ్ళండి. ముఖ్యంగా మోటార్ సైకిల్‌పై వెళ్ళేవారు గుర్తించుకోండి. మండలంలోని కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు దాటాక గూడూరు వెళ్ళే మార్గంలో ఉన్న వంతెన దెబ్బతిని ఉంది. ఇక్కడ ఆదమరిచారో..బోల్తా పడడం ఖాయం. లేదా మీ వాహనం పంక్చర్ అయినా అవుతుంది. ఇటీవల మూడురోజుల పాటు కురిసిన వర్షాలకు ఇక్కడి వంతెన ఇలా తయారైంది. దీనిపై పోలీసులు, ఐజేఎం అధికారులు దృష్టి సారించాలి.

రక్తదాతలు.. ప్రాణదాతలు

రక్తదాతలను అభినందించిన ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, ప్రశాంతి రెడ్డి



కోవూరు: రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రక్తదాతలందరూ ప్రాణ దాతలేనని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో ఆది వారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నియోజకవర్గానికి చెందిన యువకులు అధిక సంఖ్యలో రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, ఎంపీపీ తుమ్మలపెంట పార్వ తి, సర్పంచు యాకసిరి విజయ, జొన్నవాడ దేవాలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, కోవూరు, కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు సుధాకరరెడ్డి, సురేంద్ర బాబు, శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కొల్లారెడ్డి సుధాకర రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, జెట్టి మదన్ మోహన్ రెడ్డి, గాది రాజు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

మనుబోలు: అన్ని దానాల్లోకెల్ల రక్త దానం చాలా గొప్పది, అలాంటి శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మె ల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పోలీసులను ప్రశంసించారు. స్థానిక సీఆర్ఆర్ కల్యాణ మండపం లో ఆదివారం పోలీసు అమర వీ రుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మె గా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నోవా బ్లడ్‌బ్యాంక్ సారథ్యంలో దాతల నుంచి రక్తం సేకరించారు. 180 మంది రక్తదాతలతో పాటు, సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ శివరాకేష్‌లను డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు అభినందించారు. ఈ కార్యక్ర మంలో ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామ కృష్ణయ్య, నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకట రమణయ్య, రాజాగౌడ్, దండు చంద్ర శేఖర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి

పొదలకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లపాలెం గ్రామ శివారులో కోడిపందేలపై ఎస్ఐ హనీఫ్ ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ముగ్గురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మూడు కోళ్లు, రూ.2100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

పొదలకూరులో ట్రాన్స్‌ఫార్మర్ రిపేరీ షెడ్

● రూ. 95 కోట్లతో త్రీ ఫేజ్ లైన్లు ● ప్రారంభించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి



ట్రాన్స్‌ఫార్మర్ రిపేరీ షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పొదలకూరులో ట్రాన్స్‌ఫార్మర్ రిపేరీ షెడ్‌ను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఐదు మండలాల రైతులకు ఉపయోగపడేలా పట్టణంలోని రాంనగర్ గేట్ సెంటర్‌లోని సబ్ విద్యుత్ స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ షెడ్‌ను విద్యుత్ ఎస్ఈ రాఘవేంద్ర, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేసి లో ఓల్టేజీ సమస్యకు సంపూర్ణ పరిష్కారం చూపుతామన్నారు. కలువాయి, మనుబోలు, రాపూరు, సైదాపురం, పొదలకూరు మండలాల పరిధిలోని ప్రజలు, రైతులకు ఈ షెడ్ చాలా అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ షెడ్‌లో నెలకు వందకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు రిపేరు చేసే సౌకర్యం ఉందన్నారు. ఆర్డీఎస్ కింద సర్వేపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా రూ.95 కోట్లతో అన్నీ సింగిల్ ఫేస్ లైన్లను త్రీఫేజ్ లైన్లుగా మారుస్తున్నామన్నారు. విద్యుత్ అధికారులు, టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జుననాయుడు, కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, పులిపాటిల వెంకటరత్నం నాయుడు, దేగా యశ్వంత్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఆదాల మురళి పాల్గొన్నారు.

మత్స్యకారులు వేటకు వెళ్లరాదు



సూచనలు ఇస్తున్న మత్స్యశాఖ జేడీ శాంతి

ఇందుకూరుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని మత్స్యశాఖ జేడీ శాంతి సూచించారు. మండలంలోని మైపాడు బీచ్‌ను ఆమె ఆదివారం సందర్శించి మత్స్యకారులకు పలు సూచనలు చేశారు. సముద్రంలో అలల తీవ్రత అధికంగా ఉన్నప్పుడు వాతావరణ శాఖ సూచనలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ చాంద్‌బాషా, మెరైన్ ఎస్ఐ అంజిరెడ్డి, ఎఫ్‌డీఓ సురేష్, మత్స్యకారులు పాల్గొన్నారు.

ఇళ్ల వివరాల సేకరణ



గిరిజనులతో వివరాలు సేకరిస్తున్న ఏఈ శరత్

మనుబోలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మండలంలోని పల్లిపాళెం గ్రామాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా సందర్శించిన సమయంలో గిరిజనులు తమకు ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని కోరారు. కలెక్టర్ ఆదేశాలతో ఆదివారం హౌసింగ్ అధికారులు పల్లిపాళెం గిరిజన కాలనీకి వెళ్లి వివరాలు సేకరించారు. 50 మంది ఇళ్ళు కావాలని కోరినట్లు ఏఈ శరత్ తెలిపారు. కార్య క్రమంలో కార్యదర్శి దేవసేన తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధే ధ్యేయం : ఆనం


కావలి ఎడవల్లిలో కోదండరామాలయం పునర్నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఏఎస్ పేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, పురాతన ఆలయాలకు పూర్వవైభవం తీసుకొస్తామని రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని కావలిఎడవల్లి గ్రామంలో కోదండరామాలయం పునర్నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం నూతనంగా నిర్మించనున్న జలజీవన్ మిషన్ వాటర్ ట్యాంక్‌కు, సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 23 కోట్ల రూపాయల నిధులతో 17 ఆలయాల పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ప్రతి గ్రామంలోని చిన్న చిన్న గ్రామదేవతల ఆలయాల అభివృద్ధికి ఒక్కో ఆలయానికి రూ. 5లక్షల చొప్పున సుమారు 77 ఆలయాలకు నిధులు మంజూరు చేశామని, మరో 40 ఆలయాలకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. సుమారు 59 ఆలయాలలో దూప,దీప, నైవేద్యం కోసం ఆలయ పూజారి ఖాతాలో ప్రతి నెలా రూ. 10 వేలు అందిస్తామని తెలిపారు. టిటిడి శ్రీవాణి నిధులతో గ్రామాలలో నూతన ఆలయాల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, టిడిపి సీనియర్ నాయకులు గిరి నాయుడు, నాయకులు అబ్బూరి రమేష్‌నాయుడు, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, కాటంరెడ్డి నరసింహరెడ్డి, మాల్యాద్రి నాయుడు, సుధాకర్‌రెడ్డి, జిలాని బాషా, పలువురు మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం/క్రైం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్ కారణంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశామని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

● పోలీసు గ్రీవెన్స్ కూడా...

పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ వారం తుఫాన్ కారణంగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా పోలీసు కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.

మేలైన పంటకు విత్తన శుద్ధి

● తెగుళ్లు, రసం పీల్చే పురుగుల నియంత్రణ

● సాగులో తగ్గనున్న ఖర్చులు ● ఆశాజనకంగా దిగుబడులు


విత్తనశుద్ధిని పరిశీలిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త లలితా శివజ్యోతి(ఫైల్)

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పంటలసాగులో విత్తనశుద్ధి ఎంతో కీలకమని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కే.కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పంట ఏదైనా విత్తనశుద్ధి చేయడం వల్ల ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తాయని ఆయన తెలిపారు. మట్టిలో వ్యాపించే శిలీంధ్రాలు, విత్తన తరువాత ఆశించే రసం పీల్చే పురుగులు, తెగుళ్లను అదుపులో ఉంచుకోవచ్చునన్నారు. దీనివల్ల పంటలసాగులో రైతులకు ఖర్చులు తగ్గే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విత్తనశుద్ధి ఎలా చేసుకోవాలో ఆంధ్రజ్యోతి ద్వారా ఆయన రైతులకు తెలియజేశారు.

● వరి

కిలో వరి విత్తనాలకు 3గ్రాముల కార్బండెజిం 50శాతం మందును కలిపాలి. 24గంటల తరువాత నారుమడిలో చల్లుకోవాలి. దంప నారుమళ్లకయితే లీటరు నీటికి 1గ్రాము కార్బండెజిం 50శాతం మందును కలిపి ఈ ద్రావణంలో విత్తనాలను 24గంటలు నానబెట్టాలి. ఇంకా 24గంటలు మండెకట్టి మొలకెత్తిన విత్తనాన్ని దంప నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టేందుకు లీటరు మందు సరిపోతుంది. కార్బండెజిం 25శాతం, మాంకోజెబ్ 50 శాతం మత్రమ శిలీంధ్రనాశనిని వాడితే 2గ్రాములు కిలో విత్తనానికి, లీటరు నీటికి వంతున వాడాలి.

● మొక్కజొన్న

కిలో విత్తనానికి 3గ్రాముల మాంకోజెబ్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. దీంతో లేతదశలో మొక్కలను తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చు.

● శనగ

కిలో విత్తనానికి 10గ్రాముల ట్రైకోడెర్మా విరిడి పొడిని ఇంకా 3గ్రాముల థైరాం లేదంటే కాప్టాన్ లేదంటే 2.5గ్రాముల కార్బండెజింతో విత్తనశుద్ధి చేసుకోవాలి. దీనివల్ల విత్తనం ద్వారా, నేల ద్వారా వ్యాపించే రోగాలను చాలా వరకు అరికట్టవచ్చు. కిలో విత్తనానికి 1.5గ్రాముల విటావాక్స్ పవర్(కార్బాక్సిన్ 37.5+థైరం 37.5శాతం డిఎస్)ను వాడి కూడా విత్తనశుద్ధి చేసుకోవచ్చు. మొదట శిలీంధ్రనాశినిని తరువాత ట్రైకోడెర్మాను వాడి విత్తనశుద్ధి చేయాలి.

● జొన్న

కిలో విత్తనానికి 3గ్రాముల థైరాం లేదంటే కాప్టాన్ లేదంటే 1.5గ్రాముల టెబ్యుకొనజోల్ 2శాతం మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. మొవ్వ ఈగ నివారణకు కిలో విత్తనానికి 3గ్రాముల థయోమిథాక్సాం మందు కలిపి విత్తనశుద్ధి చేయాలి.

● పెసర, మినుము

కిలో విత్తనానికి 2.5గ్రాముల మాంకోజెబ్ లేదంటే కార్బండెజిం వంటి తెగుళ్ల మందులతో అదేవిధంగా 5మి.లీ ఇమిడాక్లోప్రిడ్ లేదంటే 5గ్రాముల థయోమిథాక్సాం కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. దీనివల్ల 15 నుంచి 20రోజుల వరకు తెగుళ్ల, రసంపీల్చే పురుగుల బారి నుంచి పంటను రక్షించుకోవచ్చు.

కిలో విత్తనానికి 3గ్రాముల మాంకోజెబ్ 50శాతం+ కార్బండెజిం 25శాతం లేదంటే 3గ్రాముల మాంకోజెబ్, 8గ్రాముల ట్రైకోడెర్మా విరిడి పొడి మందును పట్టించాలి. కాండం కుళ్లు వైరస్ తెగులు, వేరు పురుగు ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి ఇమిడాక్లోప్రిడ్ 17.8ఎస్.ఎల్ 2మి.లీ చొప్పు కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.

● వేరుశనగ

మొదలు కుళ్లు, వేరుకుళ్లు, కాండం కుళ్లు తెగుళ్లు ఎక్కువగా ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి 10గ్రాముల ట్రైకోడెర్మా విరిడిని పట్టించాలి. విత్తనాన్ని మొదట క్రిమిసంహారక మందుతో శుద్ధి చేసి, నీడలో ఆరబెట్టిన తరువాత శిలీంధ్రనాశనితో శుద్ధి చేయాలని ఆయన వివరించారు.

వ్యాపారిని బురిడీ కొట్టించి...
బంగారు ఉంగరంతో పరారీ

కలువాయి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓ మందుల దుకాణం యజమానిని బురిడీ కొట్టించి బంగారు ఉంగరంతో ఇద్దరు యువకులు పరారైన సంఘటన ఆదివారం కలువాయిలో జరిగింది. బాధితుడు, పోలీసుల కథనం మేరకు... సోమశిల మెయిన్ రోడ్డులో ఉన్న ఒక మెడికల్ షాపునకు ఉదయం 9గంటల సమయంలో ఇద్దరు యువకులు మోటారుసైకిల్‌పై వచ్చి గ్యాస్ట్రిక్ సమస్యకు మందులు అడిగి తీసుకుని షాపు యజమాని పాబోలు కోటేశ్వరరావుతో మాటలు కలిపారు. ఓ పెన్ను, వైట్ పేపరు అడిగి తీసుకున్నారు. ఆ తరువాత కోటేశ్వరావు చేతి వేళ్లకు ఉన్న ఉంగరం చూస్తూ మీ రింగ్ చాలా బాగుంది.. ఇలాంటిది నేనూ చేయించుకోవాలి.. ఒకసారి మోడల్ చూస్తాను ఇవ్వమని వారు అడిగారు. దీంతో ఆయన ఉంగరం తీసి వారికి ఇచ్చాడు. వారు ఉంగరాన్ని వైట్ పేపరులో పెట్టి మడిచి ఆయనకు ఇచ్చి మేము తరువాత వస్తాము అప్పటికి పేపరుపై ముద్ర పడుతుందని చెప్పారు. దీంతో ఆయన దాన్ని డబ్బుల డబ్బాలో పెడుతుండగా మీ డబ్బాలో ఏమిటీ కాయన్‌లు ఉన్నాయంటూ వారు డబ్బాలో చేయి పెట్టి ఉంగరం కాజేశారు. కోటేశ్వరావును ఏమార్చేందుకు వారిలో ఒకడు 50రూపాయలకు విక్స్ బిళ్లలు ఇవ్వమని అడగ్గా ఆయన ఆ పనిలో ఉండగా వారు అక్కడనుంచి మోటారుబైక్‌పై పరారయ్యారు. వారు వెళ్లిన తరువాత చూసుకుంటే ఉంగరం లేకపోవడంతో జరిగిన మోసంపై కోటేశ్వరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో దొంగలను గుర్తించేందుకు పోలీసులు మెయిన్ రోడ్డులో ఉన్న సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.

ముందస్తు చర్యలు చేపట్టండి

● విద్యుత్ తీగలకు దగ్గరగా వెళ్లొద్దు ● ఏపీ ఎస్పీడీసీఎల్ సీజీఎం ఆదిశేషయ్య


సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఆదిశేషయ్య

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా ఎటువంటి విపత్తు వచ్చినా విద్యుత్ సరఫరా వ్యవస్థకు అంతరాయం కలగకుండా ఉండేలా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ మేనేజర్ కే ఆదిశేషయ్య సూచించారు. మొంథా తుఫాన్‌కు సంబంధించిన హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం ఆయన జిల్లా అధికారులతో సమీక్ష జరిపారు. తుఫాన్ నష్టాన్ని తగ్గించే చర్యలు, విద్యుత్ సరఫరా నిరంతరతను కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితులలో త్వరిత చర్యలపై దిశా నిర్దేశం చేశారు. నెల్లూరులో ప్రధాన కంట్రోల్ రూము ఏర్పాటు చేశారని, ప్రతి డివిజన్ స్థాయిలో కూడా కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి విద్యుత్ సిబ్బంది అలర్ట్‌గా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. తుఫాన్ సమయంలో అవసరమైన విద్యుత్ పోల్స్ తగిన మొత్తంలో ప్రతీ డివిజన్‌లో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో చర్యలు తీసుకునేందుకు 43 ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ లైనులు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలెవరూ తుఫాన్ సమయంలో విద్యుత్ లైన్లకు దగ్గరగా వెళ్లరాదని, ఏవైనా వైర్లు తెగిపడినట్లు కనిపిస్తే వెంటనే స్థానిక లైన్‌మెన్‌కు, కంట్రోల్ రూమ్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ బీ జగదీష్, సూపరింటెండెంట్ కే రాఘవేంద్రం, విద్యుత్ అధికారులు బాలచంద్ర, శ్రీధర్ పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో ఉద్యోగాల భర్తీకి రేపు ఇంటర్వ్యూలు

వెంకటాచలం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ పరిధిలోని కావలి పీజీ క్యాంపస్ ఫార్మసీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ఈనెల 28న వీఎస్‌యూలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, నాన్ టీచింగ్ పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయనున్నారు. ఈ నియామకాలన్నీ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) నిబంధనల ప్రకారమే జరుగుతాయని స్పష్టం చేశారు. ఇంటర్వ్యూలకు అభ్యర్థులు నేరుగా హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలు, అర్హతల కోసం వీఎస్‌యూ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

ఏఎస్‌పేటలో ఉచిత వైద్య శిబిరం

ఏఎస్‌పేట, (ఆంధ్రజ్యోతి): నారాయణ మెడికల్ కాలేజీ, హస్పిటల్స్, పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి సహకారంలో డివిజన్ పీఎంపీ కోశాధికారి గోలి పద్మావతి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఠాగూర్ పాఠశాల సమీపంలో ఏఎస్ఐ భాస్కర్‌రెడ్డి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కె చరణ్ కుమార్, ఎం.సాయి అనూష, యం శ్వేత పాల్గొన్నారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటన

● ఆర్అండ్‌బీ రోడ్లపై చప్టాల పరిశీలన

● వాగుల ఆక్రమణలపై ఆరా


జలదంకి మండలంలో ప్రమాదకర వాగుల వివరాలను కలెక్టర్‌కు వివరిస్తున్న తహసీల్దారు ప్రమీల

జలదంకి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో జలదంకి-తెల్లపాడు, బ్రాహ్మణక్రాక-బోగోలు, బ్రాహ్మణక్రాక-కమ్మవారిపాలెం మార్గాల్లో ఆర్అండ్‌బీ రోడ్లపై గోపన్నపాలెం వద్ద ఊళ్లవాగు, కృష్ణపాడు వద్ద ఉబ్బలవాగు, చామదల వద్ద నేరెళ్లవాగు, కమ్మవారిపాలెం వాగుల చప్టాలపై వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో పలు గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. దీంతోపాటు చామదల గ్రామానికి చెందిన దంపూరి మల్లికార్జున నేరెళ్లవాగులో కొట్టుకుపోయి మృతి చెందాడు. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వర్షం వస్తే వణుకే కథనం ద్వారా ఈ విషయాలు తెలుసుకున్న కలెక్టర్ ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో చప్టాలపై వరదనీరు చేరడంతో ఎదురవుతోన్న ఇక్కట్లను స్థానికులు కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన ఆయన చప్టాల స్థానంలో వంతెనల నిర్మాణానికి సంబంధించి ఆర్అండ్‌బీ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. వాగుల ఆక్రమణలపై కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, తహసీల్దారు ప్రమీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా జలదంకి సొసైటీ అధక్షుడు కరియావుల అప్పలనాయుడు, తెలుగుయువత మండల అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డిలు కలెక్టర్‌ను కలుసుకుని తమ ప్రాంతాలలో వంతెనలు నిర్మింపజేసి ప్రజల కష్టాలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రెవెన్యూశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌పై స్టంట్స్, రీల్స్ చేస్తే తాటతీస్తాం..

ఎస్పీ అనిత వేజండ్ల హెచ్చరిక


వాహనాల తనిఖీ సందర్భంగా పోలీసు అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైం), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్టంట్స్ పేరుతో బైకులపై రీల్స్ చేస్తే తాట తీస్తామని ఎస్పీ అజిత వేజెండ్ల హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులు బాధ్యత వహించాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా పోలీసులు రాత్రి వేళ్లలో నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌ను ఎస్పీ అజిత శనివారం అర్థరాత్రి పరిశీలిం చారు. నగరంలోని వీఆర్‌సి, గాంధీబొమ్మ సెంటర్, ఆత్మకూరు బస్టాండు, మినీ బైపాస్, బుజబుజ నెల్లూరు తదితర ప్రాంతాల్లో వాహనాల తనిఖీలను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి 62 ప్రదేశాల్లో 2372 వాహనాలను పోలీసు అధికారులు తనిఖీ చేసినట్లు చెప్పారు. ఓపెన్ డ్రింకింగ్ కేసులు 31, డ్రంక్ అండ్ డ్రైవ్ 29 కేసులు నమోదు చేసి 19 వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. ఎంవీ యాక్ట్ కింద 262 కేసులు నమోదు చేసి రూ.1,34,990 అమరాధ రుసుము విధించామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేవలం ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన మాత్రమే కాదని, ప్రమాదకరమైన అపరాధమన్నారు. తనిఖీల్లో ఆయుధాలు, కత్తులు, గంజాయి, అనుమతి లేని మద్యం, వస్తువులను గుర్తిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

11వ పీఆర్‌సీ బకాయిలు,
అడిషనల్ క్యాంటం పింఛన్ ఇవ్వాలి


రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్‌దారులకు 11వ పీఆర్‌సీ బకాయిలు, క్వాంటమ్ అడిషనల్ పింఛన్లు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం గౌస్ డిమాండ్ చేశారు. ఆదివారం నెల్లూరులోని పెన్షన్ భవన్‌లో ఆ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా ట్రెజరీ డీడీ గంగాద్రి మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన సేవలు కొనియాడారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పీ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల ఆధ్వర్యంలో షుగర్ వ్యాధి అవగాహన శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి సిబ్బంది ప్రదర్శించిన తియ్యని ముప్పు నాటిక ఆకట్టుకుంది. ఈ సమావేశంలో సీ వేణు, ప్రధాన కార్యదర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి, కోశాధికారి జే హజరతయ్య, పీ బాబురెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ శ్రీనాథ్, ఖాజారసూల్, ఉపాధ్యక్షుడు డీ గోపాల్, ఎం మస్తానయ్య పాల్గొన్నారు.

సెలయేళ్లలో పర్యాటకుల సందడి


ఘటికసిద్ధేశ్వరం మార్గంలోని నల్లబండ సెలయేటిలో పర్యాటకుల సందడి

ఉదయగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు వెలుగొండ అడవుల్లో పచ్చటి అందాలను.. దూకే జలపాతాలను.. పారే సెలయేళ్లను అస్వాదించేందుకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ప్రధానంగా ఉదయగిరి దుర్గం, లింగాలదొన క్షేత్రంతోపాటు ప్రముఖ శైవక్షేత్రాలలైన ఘటికసిద్ధేశ్వరం, భైరవకోనలకు ప్రకృతి ప్రేమికులు భారీగా తరలివచ్చారు. జలపాతాలు, సెలయేళ్లలో సేదతీరుతూ ఉల్లాసంగా గడిపారు. వెలుగొండల పచ్చటి అందాలను, పారే సెలయళ్లను తిలకిస్తూ ప్రకృతి రమణీయతకు మంత్రముగ్ధులయ్యారు. ఉదయగిరితోపాటు నెల్లూరు, ఆత్మకూరు, వింజమూరు, కావలి, పామూరు, బద్వేల్ తదితర ప్రాంతాల ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలి వచ్చి వెలుగొండ అందాలు అస్వాదిస్తున్నారు.

29 వరకు బీచ్‌ల సందర్శన నిషేధం

మార్గాల మూసివేత


బీచ్ రోడ్డుకు తాడుకట్టి గస్తీ నిర్వహిస్తున్న మెరైన్ ఎస్ఐ జానకిరామయ్య, సిబ్బంది

కావలిరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం తీరప్రాంతాల బీచ్‌ల సందర్శనను పోలీసులు నిషేధించారు. అలల ఉధృతి తీవ్రరూపం దాల్చుతండటంతో పర్యాటకులు సముద్ర స్నానాలకు రాకుండా బీచ్‌ల వద్ద రోడ్లకు తాళ్లు, బారికేడ్లు అడ్డు పెట్టి ఆయా మార్గాలను మూ సివేశారు. తుఫాన్ ప్రభావంతో ఎలాంటి ప్రాణ నష్టం వాటిళ్లకుండా కావలి రూరల్ సీఐ, మెరైన్ ఇన్‌చార్జి సీఐలు జీ.రాజేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డిల పర్యవేక్షణలో మెరైన్ ఎస్ఐ జానకిరామిరెడ్డి తన సిబ్బందితో తీరంలో గస్తీ నిర్వహించారు. వచ్చిన పర్యాటకులను తిప్పి పంపారు. అలాగే ఆదివారం నుంచి 29వ తేదీ వరకు మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

ప్రైవేటు ట్రావెల్స్ వాహనాల తనిఖీ

నిబంధనలు పాటించని బస్సుల సీజ్


కావలిలో ట్రావెల్స్ బస్సును తనిఖీ చేస్తున్న ఆర్టీవో మురళీధర్, తదితరులు

కావలిరూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కావలి సమీపంలోని ముసునూరు టోల్‌గేట్ వద్ద ఆదివారం ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను ఆర్టీవో కార్యాలయ అధికారులు తనిఖీ చేశారు. ఆర్టీవో పీ.మురళీధర్ తన సిబ్బందితో కలసి నిర్వహించిన ఈ తనిఖీల్లో ఫైర్ డిటెక్టింగ్ అలారం, ఫైర్ డిటెక్షన్ అండ్ సప్రసింగ్ సిస్టం లేని 8 బస్సులను గుర్తించారు. హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ఈ బస్సుల్లో ప్రయాణికులు ఉండటంతో వారిని నెల్లూరులో దించిన అనంతరం ఆ బస్సులను సీజ్ చేసినట్లు ఆర్టీవో తెలిపారు. ఈ తనిఖీల్లో కావలి, ఆత్మకూరు ఎంవీఐలు సుందర్‌రావు, రాములు, అసిస్టెంట్ ఎంవీఐలు కరుణాకర్, లక్ష్మీబాయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రవాణాశాఖ అధికారుల దాడులు ఆదివారం కొనసాగాయి. డీటీసీ చందర్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేశారు. ఎమర్జెన్సీ డోర్ బ్లాక్ చేసిన బస్సులపై, డ్రైవర్ వెనుక రెండో డ్రైవర్‌కు బెర్త్ ఏర్పాటు చేసిన బస్సులపై కేసులు నమోదు చేశారు. ఫైర్ పరికరాలు లేని రెండు వాహనాలపై, ముందు అద్దం పగిలిన బస్సులపై కేసులు నమోదు చేశారు.

జింకను మింగిన కొండ చిలువ



మర్రిపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం ఫారెస్ట్ బీట్ ప్రాంతంలో ఓ కొండచిలువ ఆదివారం జింకను మింగింది. అటవీశాఖ అధికారి వంశీకృష్ణ తెలిపిన వివరాల మేరకు... ఆదివారం అటవీ ప్రాం తానికి వెళ్లిన గ్రామస్థులకు ఓ కొండచిలువ జింకను మింగుతుండడంతో వారు కేకలు వేయడంతో మింగిన జింకను కక్కింది. సమాచా రం అందుకున్న బీట్ ఆఫీసర్ డీఆర్వో వంశీకృష్ణకు సమాచారం అందించారు. ఆయన పరిశీలించారు. అటవీ ప్రాంతంలోకి తమ అనుమతి లేకుండా వెళ్లవద్దని గ్రామస్థులకు సూచించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	260
కోడిగుడ్ల ధర (100) : 575	

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర రూ.11,860

వెండి కిలో ధర రూ. 1,54,000

వెండి ఒక గ్రాము రూ.160.00

అన్నప్రసాదానికి రూ.50,116 వితరణ

కందుకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద ప్రతిఏటా మాలధారులకు నిర్వహించే అన్నప్రసాద కార్యక్రమానికి గొల్లవెంకటరంగం, ధారావతి దంపతులు రూ.50,116 ఆదివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ ప్రతిఏటా కార్తీకమాసం ప్రారంభం నుంచి జనవరి నెల ప్రారంభం వరకు మాలధారులకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని గత 18 ఏళ్లగా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి చేయూతనిచ్చిన గొల్ల వెంకటరంగం కుటుంబానికి అయ్యప్పస్వామి ఆశీస్సులు ఉంటాయని పేర్కొన్నారు.

పునరావాస కేంద్రాల్లో వసతులు కల్పించాలి

● జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

ఉలవపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో లోతట్టు బాధిత ప్రజలకు ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాల్లో ఎలాంటి లోటులేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశంచారు. ఆదివారం మండలంలోని మన్నేటికోటలో నీట మునిగిన తిరుపతికుంట ఎస్టీ కాలనీ, వారికి కల్పించిన పునరావాస కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అధికారులు 4 రోజులుగా బాధితులకు ఏర్పాటు చేసిన సహాయక శిబిరంలోని ఏర్పాట్లను పరిశీలించారు. అవసరమైన వైద్య సదుపాయాలు, మందులు శిబిరంలో అన్నివేళల అందుబాటులో ఉండాలని, స్థానిక అధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో తుఫాన్ తీవ్రత, లోతట్టు ప్రాంతాల్లో చేపట్టిన ముందస్తు భద్రత చర్యలపై సమీక్షించారు. జేసీ వెంట కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, తహసీల్దారు శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



ఉలవపాడు:పునరావాస కేంద్రంలో జేసీ వెంకటేశ్వర్లు

● ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

కొండాపురం: మొంథా తుఫాన్ పట్ల ప్రతీ ఒక్క రూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు సురేష్‌బాబు అన్నారు. ఆయన మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారన్నారు. పునరావాస కేంద్రాల ఏర్పాటుకు కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాల, సాయిపేట దామా చినబాబా మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలను సిద్ధం చేశామన్నారు. వీఆర్‌వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ అనుదీప్‌కుమార్, వీఆర్‌వో శ్రీను తదితరులున్నారు.

● తుఫాన్‌పై జాగ్రత్తలు పాటించాలి

అల్లూరు : మొంథా తుఫాన్ హెచ్చరికలతో ప్రతీ అధికారి అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి మృదులత, ఇన్‌చార్జి తహసీల్దారు ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం తహసీల్దారు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దారు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన ఇస్కపల్లి తీర ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. తీరప్రాంత మత్స్యకార గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వరదనీటితో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రాణ, మూగజీవాలు నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రజనీకాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● పునరావాస కేంద్రాల ఏర్పాట్ల పరిశీలన

బిట్రగుంట: బోగోలు మండలంలో పునరావాస కేంద్రాల ఏర్పాటుకు పలుప్రాంతాలను మండల తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి ఆదివారం పరిశీలించారు. తిప్ప జాతీయ రహదారి సమీపంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల, స్కిల్ డెవలప్‌మెంట్ భవనంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐ రామకుమారి, వీఆర్వో ఉన్నారు.

ఘనంగా వాసవీ వనిత లెజెండ్స్ సంబరాలు



ప్రమాణం చేయిస్తున్న బొమ్మిశెట్టి లక్ష్మీకుమారి

కావలి(టౌన్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తబజారులోని కన్యకాపరమేశ్వరి ఆలయ మండపంలో ఆదివారం వాసవీ వనిత లెజెండ్స్ సంబరాలు ఘనంగా జరిగాయి. రీజియన్ చైర్‌పర్సన్ అనుమాలశెట్టి కామాక్షి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వాసవీ క్లబ్స్ ఇంటర్‌నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బొమ్మిశెట్టి లక్ష్మీకుమారి పాల్గొని సేవా కార్యక్రమాలకు కట్టుబడి ఉంటామని సభ్యులతో ప్రమాణం చేయించారు. అనంతరం లక్ష్మీకుమారిని, కామాక్షిని, సెవెన్ లైన్స్ సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్రహ్మానందం, వెంకటసత్యనారాయణ, పవన్‌కుమార్, సాయిరామ్ పాల్గొన్నారు.

రాళ్లపాడు ప్రాజెక్టుకు జల హారతి

లింగసముద్రం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టు జలకళను సంతరించుకోవడంతో ఆయకట్టు సంఘ సభ్యులు, టీడీపీ నేతలు, అధికారులు గంగమ్మకు జలహారతి నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ప్రాజెక్టు ఆయకట్టు చైర్మన్ ఏలూరి వెంకటేశ్వర్లు, నీటి సంఘాల అధ్యక్షులు ఉన్నం సుబ్బారావు, మాల్యాద్రి, టీడీపీ నాయకులు సోంపల్లి మనోహర్, డీఈఈ ఎం వెంకటేశ్వర్లు తదితరులు గంగమ్మకు పూజలు చేసి జలహారతి నిర్వహించి, చీర, సారె, పూలు పండ్లు సమర్పించారు. ప్రజలను, రైతులను చల్లగా చూడాలని, పాడి పంటలతో తులతూగేలా దీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత అడపా రంగయయ్య, ఏఈఈ మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

● రాళ్లపాడును సందర్శించిన ఎస్పీ అజిత

ఎస్పీ అజిత వేజెండ్ల ఆదివారం సాయంత్రం రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు గురించి, ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ గురించి డీఈఈ ఎం.వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు వస్తే ప్రాజెక్టు నుంచి 1 లక్షా 20 వేల క్యూసెక్కుల నీటిని మన్నేరుకు విడుదల చేయవచ్చని చెప్పారు. ఎస్పీ వెంట కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐలు అన్వర్ బాషా, మంగారావు, ఎస్‌ఐ ఎం.నారాయణ తదితరులు ఉన్నారు.



రాళ్లపాడుకు జలహారతి ఇస్తున్న నేతలు

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

కావలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): డీఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక వెంగళరావునగర్‌లోని ఆ సమితి కార్యాలయంలో ఆదివారం డీఆర్ పేరుపై 60 మంది నిరుపేద వృద్ధులకు రూ.60 వేల విలువ చేసే నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్వాయపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు ప్రతిమ వృద్ధులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సేవాసమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు రామకృష్ణ, సతీష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న డాక్టర్ ప్రతిమ

రెడ్‌క్రాస్ ద్వారా 151వ నేత్రదానం



నాగరాజ్ కుమార్(ఫైల్)

కావలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురంకు చెందిన డాక్యుమెంటరీ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్‌వీఆర్ నాగరాజ్ కుమార్(60) అనారోగ్యంతో నెల్లూరు అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆయన నేత్రాలను సోదరుడు చలంచర్ల ఫణీంద్రకుమార్, సమీప బంధువు చలంచర్ల వెంకట కల్యాణ్ చక్రవర్తి ప్రేరణతో కావలి రెడ్‌క్రాస్ సహకారంతో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి దానం చేశారు. కుమారుడు చలంచర్ల కార్తీక్ అంగీకారంతో ప్రభుత్వ ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ కార్నియాలను సేకరించారు. కావలి రక్తదాన విభాగ కన్వీనర్ ఇలింద్ర శ్రీవాణి మాట్లాడుతూ ఇది కావలి రెడ్‌క్రాస్ ద్వారా జరిగిన 151వ నేత్రదానమని తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష

కావలి(టౌన్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక జనతాపేటలోని విశ్వశాంతి హైస్కూల్‌లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు (ఎన్ఎంఎంఎస్) ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం రత్నమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నమూనా పరీక్ష నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు, విశ్రాంత అధ్యాపకుడు ఎంవీఎస్ ప్రసాదరావు పర్యవేక్షణలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా సహకారంతో జరిగిన పరీక్షకు 189 మంది విద్యార్థులు హాజరయ్యారు. కేంద్రప్రభుత్వం డిసెంబరు 7వ తేదీన ఈ పరీక్ష నిర్వహించనుండడంతో ముందుగా నమూనా పరీక్ష నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

న్యూస్ బాక్స్

వైసీపీ కోటి సంతకాల ఉద్యమ గోడపత్రిక ఆవిష్కరణ

కావలి(టౌన్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గమైన చర్యగా వైసీపీ నేతలు పేర్కొన్నారు. ఆదివారం ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే ఆర్ ప్రతాప్‌కుమార్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. మెడికల్ కాలేజ్‌ల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన కోటి సంతకాల ఉద్యమ కార్యక్రమాన్ని ప్రారంభించి అందుకు సంబంధించిన గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రసాద్, జడ్పీటీసీ రాఘవులు, నేతలు కనమర్లపూడి నారాయణ, గంధం ప్రసన్న, పందిటి కామరాజు, మద్దిబోయిన రఘు, సాయి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఐపీఎస్ అధికారి శ్రీనివాసులురెడ్డిని కలిసిన విష్ణు

అల్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మాజీ ఐపీఎస్ అధికారి శ్రీనివాసులురెడ్డిని ఆదివారం నెల్లూరుకు రావడంతో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తన అనుచరులతో కలసి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణంరాజు, పవన్ కుమార్ రెడ్డి, బడబాగ్ని ఆంజనేయరాజు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

కలిగిరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మిక్కిలినేని గౌతమి జయంతిని పురస్కరించుకొని స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆదివారం కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సామాజిక సేవా స్ఫూర్తితో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంతో సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షిరిడీ శేష సాయినాథుడికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం పాతబిట్రగుంట ద్వారకానగర్‌లోని షిరిడీ శేషసాయినాథుని మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం తొలి ఆదివారం సందర్భంగా అయ్యప్ప మాలధారణ భక్తుల భజన కార్యక్రమాలు నిర్వహించారు. జంట నాగుల వద్ద ఉభయాలు అందచేశారు. వాకా మహేష్‌రెడ్డి, కల్యాణి దంపతులు అన్నసంతర్పణ చేశారు. మందిర వ్యవస్థాపకుడు కుట్టుబోయిన బ్రహ్మానందం పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో మెగా రక్తదానం

కావలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కావలి రెడ్‌క్రాస్ రక్త కేంద్రంలో కలాం ట్రస్ట్, సర్వ్‌విత్ లవ్ ఇండియా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 108 మంది యువకులు రక్తదానం చేశారు. కలాం ట్రస్ట్ అధ్యక్షుడు పేరూరి వెంకటసాయితేజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రక్తదాతలకు కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, వైస్‌చైర్మన్ కే.హరినారపరెడ్డిలు ప్రశంసా పత్రాలు అందచేసి అభినందించారు.



రక్తదానం చేస్తున్న యువకులు

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కందుకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : కందుకూరులోని పామూరు బస్టాండ్ సెంటర్ సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో టౌన్ ఎస్‌ఐ శివనాగరాజు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు కందుకూరు చుట్టుపక్కల పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తి అయ్యి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఆచూకి తెలిసిన వారు వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



జాతీయ రహదారిపై గేదెను ఢీకొన్న కారు

● త్రుటిలో తప్పిన ప్రమాదం

ఉదయగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణ శివారు ప్రాంతంలోని ఆదర్శ కాలనీ సమీపాన 167-బీజీ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి గేదెను కారు ఢీకొనడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరుకు చెందిన షేక్ బాషిద్ కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి సీతారామపురం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళుతున్నారు. ఈ తరుణంలో ఆదర్శ కాలనీ వద్దకు రాగానే ఒక్కసారిగా మూడు గేదెలు రహదారికిపైకి రావడంతో వాటిని తప్పించే క్రమంలో కారు ఒక గేదెను ఢీకొంది. ఈప్రమాదంలో గేదె మృతిచెందగా కారు ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. వెనుకవైపు నుంచి వచ్చిన మరో కారు సైతం గేదెను ఢీకొంది. వారికి ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ అల శ్రీను తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.



దెబ్బతిన్న కారును పరిశీలిస్తున్న ఎస్‌ఐ శ్రీను

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణంలో పొగలు

● అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

సంగం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్‌లో తాళాలు వేసిన ఓ ప్రొవిజన్స్ దుకాణంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి పొగలు కమ్ముకున్నాయి. స్థానికులు సకాలంలో స్పందించడంతో ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తరుణవాయి గ్రామానికి చెందిన ఓ యువకుడు సంగం బస్టాండ్‌లో ప్రొవిజన్ అండ్ ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగా శనివారం రాత్రి దుకాణం మూసేసి తాళాలు వేసుకుని వెళ్లాడు. ఉదయం 6 గంటల సమయంలో దుకాణంలో నుంచి దట్టంగా పొగలు బయటకు రావడాన్ని స్థానికులు గమనించి యజమానికి సమాచారం అందించడంతో వెంటనే వచ్చి షట్టర్ తాళాలు తెరవగా విద్యుత్ మీటర్ షార్ట్‌సర్క్యూట్‌కు గురై మంటలు వ్యాపించి దుకాణమంతా పొగలు కమ్ముకున్నాయి. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో నష్టం తప్పింది. అయితే అప్పటికే కొన్ని సామాన్లు కాలిపోయాయి.

వీవోఏలపై వేధింపులు మానుకోవాలి : సీపీఎం

ఉదయగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏలపై రాజకీయ వేధింపులు మానుకోవాలని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి కోడె రమణయ్య కోరారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నియోజకవర్గ స్థాయిలో వెలుగు వీవోఏలతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోఏలకు కనీస వేతనం చెల్లించడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, వీవోఏల సంఘ నాయకులు గడ్డం నాగేశ్వరరావు, షేక్ నాయబ్, కామాక్షమ్మ, చంటి, ప్రశాంతి, విజయ్, సరస్వతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

సంగం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెంలో జనసేన పార్టీ నాయకులు దాడి భాను కిరణ్ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. టిడ్కో రాష్ట్ర చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సూచనల మేరకు చదలవాడ హరీష్ కుమార్ సహకారంతో బియ్యం, పప్పులు, చింతపండు, ఇతర సామగ్రిని అందచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సులో పొగలు

(5వ పేజీ తరువాయి)

బయలుదేరింది. ఈ బస్సు పొదలకూరు నుంచి మూడు కిలోమీటర్ల దూరాన ఉన్న మర్రిపల్లి గ్రామం వద్దకు రాగానే బస్సులో నుంచి పొగలు, మాడిన వాసన వచ్చింది. దీంతో ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. దాంతో డ్రైవర్ బస్సును నిలిపివేయడంతో వెంటనే ప్రయాణికులు తమ లగేజీలతో సహా కిందకు దిగారు. అనంతరం వారివారి బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు మోటారు బైకులపై వచ్చి వారిని వెనక్కు తీసుకెళ్లారు. బ్యాటరీ వైర్ల షార్ట్ సర్క్యూట్ వల్ల పొగలు వచ్చినట్లు డ్రైవర్ తెలిపారు. ప్రత్యామ్నాయంగా మరో బస్సును ఏర్పాటు చేసినా, ఆలస్యం కారణంగానూ, భయంతోనూ ప్రయాణికులు ఎవరూ ఎక్కలేదు. కాగా తాజాగా ట్రావెల్స్ బస్సులు ప్రమాదాలకు గురవుతుండడంతో ఆందోళన చెందుతున్న ప్రయాణికులు స్లీపర్ కోచ్‌లో ప్రయాణమంటేనే హడలిపోతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

● తుఫాన్ హెచ్చరికలపై అధికారులకు మంత్రి ఆనం దిశానిర్దేశం

సంగం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆదివారం ఆయన సంగంలో పోలీసులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రధానంగా పెన్నానది పరీవాహక మండలాలైన చేజర్ల, అనంతసాగరం, సంగం మండలాల గ్రామాల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బీరాపేరు, బొగ్గేరు, పెన్నానది సమీప మండలాల గ్రామాల్లోని సచివాలయాల్లో ముందస్తుగా రేషన్ సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎటువంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి గ్రామంలో వీఆర్వోలు, పోలీసులు అందుబాటులో ఉండేవిధంగా బృందాలను ఏర్పాటు చేయాలని ఆర్డీవో, డీఎస్పీకి సూచించారు. రాకపోకలు స్తంభించే వీర్లగుడిపాడు గ్రామంపై ప్రత్యేక దృష్టిపెట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నదీ తీరప్రాంతాల్లో బోట్లను కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ వైద్యశాలలు, ఆత్మకూరు జిల్లా వైద్యశాలలో వైద్యులందరూ అందుబాటులో ఉండాలని, అత్యవసర మందులను సిద్ధం చేసుకోవాలన్నారు. అంతేకాకుండా అన్ని చెరువులు, వాగుల వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఇరిగేషన్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



తుఫాన్ హెచ్చరికలపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రక్తదానం ప్రాణదానంతో సమానం

రక్తదానం ప్రాణదానంతో సమానమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సంగంలో పోలీసుల అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరాన్ని ఏర్పాటుచేసిన ఆత్మకూరు డివిజన్ పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, డీఎస్పీ వేణుగోపాల్, టీడీపీ సీనియర్ నాయకులు తాళ్లూరి గిరినాయుడు, సీఐ వేమారెడ్డి, గంగాధర్, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసేవే కాకర్ల ట్రస్టు ధ్యేయం



గౌతమి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల, టీడీపీ నాయకులు

ఉదయగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవ చేయడమే కాకర్ల చారిటబుల్ ట్రస్టు ధ్యేయమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ట్రస్టు ఆధ్వర్యంలో యూఎస్ఏ అట్లాంట వాస్తవ్యులు మిక్కిలినేని గౌతమి జయంతిని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు, ట్రస్టు ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా, పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లోని బస్‌షెల్టర్ చుట్టూ ఆక్రమణలను తొలగించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కాకర్ల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్లు బయ్యన్న, మధు, ప్రభాకర్, సొసైటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, ఉండేలా గురవారెడ్డి, నల్లిపోగు రాజా, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

వరద తగ్గేవరకు గ్రామస్థులెవరూ బయటకు రావొద్దు

సంగం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావం తగ్గేవరకు గ్రామస్థులెవ్వరూ బయటకు రావద్దని ఆర్డీవో పావని, డీఎస్పీ వేణుగోపాల్ సూచించారు. మండలంలోని వరద తీవ్రత ప్రాంతాలను అధికారుల బృందం ఆదివారం సాయంత్రం పరిశీలించింది. ఆర్డీవో, డీఎస్పీ ఆధ్వర్యంలో అధికారుల బృందం సంగం బ్యారేజి, బీరాపేరు వాగు, కోలగట్ల, వీర్లగుడిపాడు వరద తీవ్రత ప్రాంతాలను పరిశీలించారు. ఇరిగేషన్ ఏఈ వినయ్‌తో వరద తీవ్రత, ఏర్పడే ఇబ్బందులపై చర్చించారు. అనంతరం బొగ్గేరు ప్రవాహంతో రాకపోకలు స్తంభించిన వీర్లగుడిపాడు గ్రామాన్ని అధికారుల బృందం సందర్శించింది. గ్రామానికి వెళ్లే మార్గంలో బొగ్గేరు కలుజు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆర్డీవో, డీఎస్పీ ట్రాక్టర్‌లో గ్రామానికి చేరుకున్నారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ వరద ముప్పుతో భయపడవద్దని, ప్రభుత్వం తరపున అధికార యంత్రాంగమంతా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వారి వెంట తహసీల్దారు సోమ్లానాయక్, సీఐ వేమారెడ్డి, ఏఈ వినయ్, ఎస్‌ఐ రాజేష్, క్షేత్ర స్థాయి అధికారులు ఉన్నారు. కాగా, వరద పెరిగితే గ్రామానికి వెళ్లే అవకాశం ఉండదని మంత్రి ఆనం ఆదేశాలతో గ్రామానికి ముందస్తుగా ఉచిత బియ్యాన్ని లారీలో తరలించారు.



సంగం బ్యారేజ్‌లో వరద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఆత్మకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీవో బి పావని అధికారులకు సూచించారు. 24 గంటలూ తమ ప్రాంతాల్లో ఉండి ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను యుద్ధప్రాతిపదికన పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

మునిసిపాలిటీ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు మున్సిపాల్టీ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ జి గంగాప్రసాద్ తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో వర్షాల కారణంగా ఏవైనా సమస్యలు తలెత్తితే 08627-220385కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన ప్రజలకు సూచించారు.


ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సీతారామపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోకల వారిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పోలేరమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి సీతారాముల కల్యాణాన్ని తిలకించారు.

అంకలమ్మకు పొంగళ్లు




రౌద్దాలి అంకలమ్మకు నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

సీతారామపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక యోగానంద బాలాత్రిపుర సుందరిదేవి ఆశ్రమం సమీపంలో గ్రామదేవత రౌద్దాలి అంకలమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పొంగళ్ల సామగ్రిని కొత్త గంపల్లో పెట్టుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎక్స్‌కవేటర్‌తో చేస్తున్న రోడ్డు పనులు

అనంతసాగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌స్టేషన్ ఎదురు వీధి, పూసల కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉండడంతో కొద్దిపాటి వర్షం కురిసినా నడవలేని పరిస్థితి నెల కొంది. ఇటీవల బురద మయంగా రహదారులు అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఆదివారం ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు చదును చేసే పనులు చేపట్టారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 27 అక్టోబరు 2025

అమ్మో.. ఏనుగులు



చిన్నరామాపురంలోకి చొరబడిన ఏనుగులు

వారం రోజులుగా పంట పొలాలపై పడి ధ్వంసం చేస్తున్న ఏనుగుల మంద.. ఆదివారం తెల్లవారుజామున ఊరిపైన పడ్డాయి. శనివారం రాత్రి చంద్రగిరి మండలం చిన్నరామాపురం వద్ద పంట పొలాలపై దాడులు చేశాయి. ఆదివారం తెల్లవారు జామున తొమ్మిది ఏనుగులు ఏకంగా చిన్నరామాపురంలోకే చొరబడ్డాయి. దీంతో గ్రామస్తులు ఉదయం వరకు ఇళ్లల్లోనే ఉండి.. బిక్కుబిక్కుమంటూ గడిపారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఏనుగుల జాడను కనిపెడుతూ వాటి వెంట సాగారు. ఉదయానికి నాగపట్ల అటవీ ప్రాంతంలోకి వెళ్ళడంతో గ్రామస్తులు, అటవీశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐలు, సిబ్బంది గ్రామాల్లోకి వెళ్ళి ఏనుగులు సంచరిస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరించారు. ఏనుగులు వస్తే అటవీశాఖకు, తమకు సమాచారమివ్వాలని కోరారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

ఇలా గురి పెట్టాలి

ఇదిగో, ఈ గన్‌ను ఇలా తీసుకుని గురిపెట్టాలి.. అంటూ విద్యార్థులకు ఎస్పీ సుబ్బరాయుడు అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఆదివారం తిరుపతిలోని పరేడ్ మైదానంలో పోలీసుల ఆయుధాలను ప్రదర్శించారు. వీటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వివిధ రకాల ఆయుధాలు, భద్రతా పరికరాలు, కమ్యూనికేషన్ సిస్టమ్, ఫోరెన్సిక్ సామగ్రి తదితరాలు ఎలా పనిచేస్తాయి? ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగిస్తామనేది విద్యార్థులు నేరుగా తెలుసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. తద్వారా వారిలో పోలీసు వ్యవస్థపై అవగాహన, విశ్వాసం పెంచడమే లక్ష్యమన్నారు. ఎస్ఎల్ఆర్, ఇన్‌సాస్, 9 ఎంఎం పిస్టల్ వంటి ఆయుధాలు, డ్రోన్ పరికరాలు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, స్నిఫర్ డాగ్ యూనిట్లను ప్రదర్శించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, శ్రీనివాసరావు, డీఎస్పీలు వెంకటనారాయణ, భక్తవత్సలం, చంద్రశేకర్, ఆర్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి




పోలీసు ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ



దైవాలదిబ్బ వద్ద..

'మొంథా' ఏం చేస్తుందో?

- బలహీనంగా స్వర్ణముఖి నది పొర్లుకట్టలు
- ఏమాత్రం వరద పెరిగినా నాలుగు గ్రామాలకు ఇబ్బందే



కోట మండలం పుచ్చలపల్లి వద్ద కోతకు గురైన పొర్లుకట్ట



దొరువుకట్ట వద్ద పగుళ్లు ఇచ్చిన స్వర్ణముఖి పొర్లుకట్ట

కోట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): భారీగా వర్షాలు పడి స్వర్ణముఖి నదీ మరింత ఉధ్రుతమైతే ఆ నాలుగు గ్రామాలకు ఇబ్బందే. ఈ క్రమంలో తమను 'మొంథా' తుఫాను ఏం చేస్తుందోనని కోట మండలంలోని ఆ గ్రామాల వారు బిక్కుబిక్కుమంటున్నారు. కోట మండలం రుద్రవరం నుంచి గూడలి మీదుగా తిన్నెలపూడి వరకు ఆరు కిలోమీటర్లు.. పుచ్చలపల్లి నుంచి దొరువుకట్ట వరకు 16 కిలోమీటర్లు స్వర్ణముఖినది ఉంది. ఈ నదికి రెండువైపులా పొర్లుకట్టలు బలహీనంగా మారాయి. పదేళ్లుగా వీటికి శాశ్వత మరమ్మతులు చేయలేదు. దీంతో చాలాచోట్ల కట్టలు పగుళ్లిచ్చాయి.మట్టి జారిపోయాయి. దీంతో స్వర్ణముఖికి ఉధృత ప్రవాహం వస్తే ఎలాగంటూ సమీప ఐదు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మొంథా తుఫాను ప్రభావంవల్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవనున్నాయి. ఈ క్రమంలో వాకాడు బ్యారేజీ నుంచి పుచ్చలపల్లి, అల్లంపాడు, దైవాలదిబ్బ, దొరువుకట్ట గ్రామాలమీదుగా వెళ్లే స్వర్ణముఖినదిలోకి 4,500క్యూసెక్కుల వరదనీటిని వదిలారు. ఇప్పటికే పుచ్చలపల్లి వద్ద స్వర్ణముఖి కరకట్టలు ధ్వంసమై ఉన్నాయి. ఇంకొంచెం ప్రవాహం పెరిగితే ప్రమాదమేనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంతో పాటు 1200 ఎకరాలకు ముప్పేనని అంటున్నారు. అల్లంపాడు, దొరువుకట్ట, దైవాలదిబ్బతో పాటు మజరా గ్రామాల్లో ఉన్న దళిత, గిరిజన కాలనీలు కూడా ఆయా స్వర్ణముఖి పొర్లుకట్టల కింద ఉన్నాయి. ఆయా కట్టలన్నీ గతేడాది వచ్చిన వర్షాలు, వరదలకు పూర్తిగా కోతకు గురై ఉన్నాయి. ఈ క్రమంలో స్థానికుల్లో 'మొంథా' ఏం చేస్తుందోనన్న భయాందోళన నెలకొంది. మరోవైపు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఈ పొర్లుకట్టలను పరిశీలించారు. ఏ క్షణంలో నైనా ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున సుమారు 4 గ్రామాల వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిన్నమొన్నటి వరకు ధైర్యంగా ఉంటూ వచ్చిన ఆయా గ్రామాల ప్రజలు ఎప్పుడు స్వర్ణముఖి నది కన్నెర్రచేస్తుందోనన్న ఆందోళనతో భయంభయంగా గడుపుతున్నారు.

విద్యాసంస్థలకు సెలవు

తిరుపతి(విద్య), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సోమవారం నుంచి మూడు రోజులపాటు సెలవులు ప్రకటిస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, అన్ఎయిడెడ్, అంగన్వాడీ కేంద్రాలను మూడు రోజులపాటు మూసివేయాలని డీఈవో కేవీఎన్ కుమార్ విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బడులకు సంబంధించి ఏ సమస్య ఉన్నా 85559 59755, 98857 92571 99666 35344 నెంబర్లలో కంట్రోల్ రూమ్‌కు సమాచారమివ్వాలన్నారు.

ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోండి: కలెక్టర్

వాకాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాన్ నేపథ్యంలో ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆదివారం ఆయన ఏర్పేడు, శ్రీకాళహస్తి, కోట, వాకాడు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. చెరువులు, నదులను పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. వాకాడు స్వర్ణముఖి బ్యారేజీ రోప్‌లను, బాలిరెడ్డిపాళెం వద్ద ముంపు ప్రాంతాన్ని చూసిన ఆయన.. స్వర్ణముఖి బ్యారేజీకి భారీ వరద వచ్చే అవకాశం ఉండడంతో గేట్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 27, 28, 29 తేదీల్లో 90నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, సముద్రతీర ప్రాంత మండలాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సముద్రవేటకు వెళ్లిన మత్స్యకారులను ఇప్పటికే ఒడ్డుకు రప్పించామన్నారు. ముంపునకు గురయ్యే గ్రామాలను గుర్తించి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రత్యేక రక్షణ బృందాలను అందుబాటులో ఉంచామని వివరించారు. ఆక్రమణకు గురైన చెరువులు, ప్రభుత్వ భూములను గుర్తించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో గూడూరు ఇన్‌చార్జి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశి, ఇరిగేషన్ ఎస్ఈ రాధాకృష్ణమూర్తి, తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయిప్రకాష్, ఇరిగేషన్ బ్యారేజీ ఏఈ శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ కిరణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి, ఎంఈవో నసీం ఆలీ, విద్యుత్‌శాఖ ఏఈ విజయలక్ష్మి, ఏవో దీప, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదనరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాలిరెడ్డిపాళెం వద్ద పొర్లుకట్టలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నేడు పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ రద్దు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండడంతో రద్దు చేశామన్నారు.

సహాయక చర్యలకు అదనంగా రూ.కోటి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో తక్షణ సహాయక చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.19కోట్లు మంజూరు చేసింది. అందులో తిరుపతి జిల్లాకు రూ.కోటి కేటాయించింది. ఇప్పటికే రూ.2కోట్లు విడుదలచేసిన విషయం తెలిసిందే. తుఫాన్ ప్రభావంఎక్కువగా ఉన్న తిరుపతి, నెల్లూరు జిల్లాలకు రూ.కోటి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు రూ.50లక్షలు చొప్పున ప్రభుత్వం విడుదల చేసింది.

మూడు రోజులు బ్లాస్టింగ్ నిషేధం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని క్వారీ కౌలుదారులు మూడు రోజులపాటు క్వారీల్లో బ్లాస్టింగ్ చేయకూడదని జిల్లా మైన్స్ అధికారులు తెలిపారు. కార్మికులకు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నారు. మొంథా తుఫానుతో ఏదైనా నష్టం జరిగితే జిల్లా యంత్రాంగంతో కలసి మానవతా దృక్పథంతో సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

అధికారులూ.. అప్రమత్తంగా ఉండండి

- కలెక్టర్ ఆదేశం.. నేడు పీజీఆర్ఎస్ రద్దు
- కంట్రోల్ రూమ్ నంబర్ 0877-2236007

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రానున్న మూడు రోజులు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యల్లో పాల్గొనాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. తుఫాన్ కారణంగా సోమవారం మండలం, డివిజన్, కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌ను రద్దు చేసినట్లు ప్రకటించారు. ప్రమాదకర పరిస్థితులుంటే కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూమ్ 0877-2236007 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'కలంకారీ' మునిరత్నమ్మ హఠాన్మరణం



మునిరత్నమ్మ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కలంకారీలో జాతీయ అవార్డు గ్రహీతగా ఎంతో పేరు గాంచిన మునిరత్నమ్మ ఆదివారం హఠాన్మరణం చెందారు. శ్రీకాళహస్తికి చెందిన మునిరత్నమ్మ మూడు దశాబ్దాలకుపైగా కలంకారీలో ఎన్నో వైవిధ్య చిత్రాలను రూపొందించారు. రాష్ట్ర అవార్డుతో పాటు దేశవిదేశాల్లో ఎన్నో ప్రశంసలు పొందారు. 2008 కలంకారీలో తొలి మహిళా కలంకారీ జాతీయస్థాయి అవార్డును అందుకున్నారు. తుదిశ్వాస వరకు హస్తకళప్రావీణ్యంలో రాణించారు. ప్రపంచ నలుమూలలలోని పలు దేశాల్లో ఆమె చిత్రాలకు అభిమానులను సంపాదించుకున్నారు. ఆదివారం ఆమె హఠాన్మరణంతో హస్తకళ అభిమానులు, సాటి కళాకారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలువురు ఆమెకు సంతాపం వ్యక్తం చేశారు.

◆ వస్తాడని ఎదురుచూస్తే
కన్నీళ్లే మిగిలాయ్..!

- కర్నూలు బస్సు ప్రమాదమృతుల్లో గుడుపల్లెవాసి

అమ్మా.. నేను ఊరికి బయలుదేరా.
- కూతురికి వాట్సప్ కాల్ చేసి చెప్పాడు.

శుక్రవారం ఉదయం 7.30 గంటలకల్లా బంగారుపేట వచ్చేస్తా. కారు తీసుకొని వచ్చేయ్.
- కుప్పంలోని ట్రావెల్స్ డ్రైవర్ నాగరాజుకు ఫోన్ చేసి చెప్పారు.



మృతుడు త్రిమూర్తి (ఫైల్ ఫొటో)

కానీ, ఆయన రాలేదు. ఎక్కడున్నాడో తెలుసుకుందామంటే ఫోను స్విచ్చాఫ్. ఒకవైపు ఏమయ్యారోనని కుటుంబీకుల్లో ఆదుర్దా. మరోవైపు.. పనుల నిమిత్తం తరచూ బయట వెళ్తుండటంతో.. వస్తారులే అనే నమ్మకం. ఇంతలో హైదరాబాదు నుంచి వస్తూ కర్నూలు వద్ద ట్రావెల్స్ బస్సు కాలిపోయిందన్న వార్తతో.. ఆ బస్సులో ఏమైనా ఎక్కారా అన్న ఆందోళన ఇంకోవైపు. వస్తారులే అంటూ శుక్ర, శనివారాల్లో ఎదురు చూసిన వారికి కన్నీళ్లే మిగిలాయి. కర్నూలు బస్సు ప్రమాదంలో 19వ మృతదేహం గుడుపల్లె మండలం యామగానిపల్లెకు చెందిన త్రిమూర్తి(58)గా ఆదివారం నిర్ధారించడంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

త్రిమూర్తి క్వారీ వ్యాపారం చేస్తున్నారు. పెద్ద భార్య వసంతమ్మతో కలిసి ఉంటున్నారు. త్రిమూర్తి, వసంతమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు కళ్యాణ్ భరత్ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, కుమార్తె చైతన్య పెళ్లయి చెన్నైలో నివసిస్తున్నారు. హైదరాబాదులో బంధువుల పెళ్లికని ఈనెల 22వ తేది ఉదయం కుప్పం నుంచి బెంగళూరుకు రైలులో.. అక్కడ్నుంచి ట్రావెల్స్ బస్సులో వెళ్లారు. హైదరాబాదులో 23వ తేదీ వివాహానికి హాజరయ్యారు. అదే రోజు రాత్రి ట్రావెల్స్ తిరుగు ప్రయాణమయ్యారు. తాను కుప్పం బయలుదేరుతున్నట్లు చెన్నైలోని కుమార్తె చైతన్యకు వాట్సప్ కాల్ చేసి చెప్పారు. తనకు ఎప్పుడూ కారు తీసుకువచ్చే కుప్పానికి చెందిన ట్రావెల్స్ డ్రైవర్ నాగరాజుకు ఫోన్ చేసి.. శుక్రవారం (24వ తేది) ఉదయం 7.30కంతా కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు చేరుకుంటానని చెప్పారు. ఆ సమయానికి కారు తీసుకురమ్మన్నారు. ఆ ప్రకారం బంగారుపేట వెళ్లిన నాగరాజు ఎంత సేపు వేచిఉన్నా త్రిమూర్తి రాకపోవడం.. ఎటువంటి సమాచారం లేకపోవడంతో ఫోను చేశారు. త్రిమూర్తి వద్దనున్న నెంబర్లకు కాల్ చేసినా స్విచ్ ఆఫ్ అనే వచ్చింది. ఆ తర్వాత ఆయన వెనక్కి వచ్చేశారు. హైదరాబాదు నుంచి బెంగళూరు బయలుదేరిన ట్రావెల్స్ బస్సు కర్నూలు ప్రమాదంలో దగ్ధమైందన్న వార్తలు మీడియాలో రావడంతో త్రిమూర్తి కుటుంబ సభ్యులు కొంత ఆందోళనకు గురయ్యారు. ఇక, 19 మంది మృతుల వివరాలు ఆరా తీసే క్రమంలో కర్నూలు పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ సేకరించారు. తద్వారా 19వ మృతదేహం త్రిమూర్తిది అయిఉంటుందని ప్రాథమికంగా గుర్తించారు. డీఎన్ఏ పరీక్ష నిమిత్తం హైదరాబాదులోని అతడి కుమారుడు కళ్యాణ్ భరత్‌కు సమాచారం ఇచ్చి కర్నూలు పిలిపించారు.ఆదివారం జరిపిన డీఎన్ఏ పరీక్షల్లో చనిపోయింది త్రిమూర్తిగా నిర్ధారించినట్లు తెలిసింది. కర్నూలు నుంచి మృతదేహాన్ని సోమవారానికి యామగానిపల్లెకు తీసుకొచ్చే అవకాశం ఉందని త్రిమూర్తి కుటుంబీకులు తెలిపారు.

- కుప్పం, ఆంధ్రజ్యోతి

కొలువుదీరిన ముక్కంటి ధర్మకర్తలమండలి

- ఘనంగా ప్రమాణ స్వీకారం

శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తలమండలి ఆదివారం కొలువుదీరింది. ఎమ్మెల్యే సుధీర్, ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి ఆధ్వర్యంలో అంజిఅంజి వినాయకస్వామి సన్నిధిలో ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లను మండలి సభ్యులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించారు. పరిపాలన భవనంలోని మండలి చాంబర్‌కు చేరుకుని లాంఛనంగా ఆశీనులయ్యారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు తదితరులు అభినందనలు తెలిపారు. టీడీపీ నాయకులు మునిరాజానాయుడు, కంఠా రమేష్, గుర్రప్పశెట్టి, దుర్గాప్రసాద్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. పరిపాలన భవనంలో ధర్మకర్తల మండలికి మంత్రి నాదెండ్ల మనోహర్ అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే సుధీర్ సమన్వయంతో పొత్తు ధర్మంలో భాగంగా జనసేనకు ముక్కంటి ఆలయ ఛైర్మన్ స్థానం లభించిందని మంత్రి అన్నారు. కొన్ని చోట్ల స్థానిక ఎమ్మెల్యేలు గైర్హాజరైతే.. శ్రీకాళహస్తిలో మాత్రం ఎమ్మెల్యే పొత్తు ధర్మాన్ని పాటిస్తూ పాల్గొనడం సంతోషకరమన్నారు. ఆయనతో పాటు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, హస్తకళల కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, జనసేన నేత కిరణ్ రాయల్ పాల్గొన్నారు.

భక్తులకు తీవ్ర ఇక్కట్లు

ఆదివారం రద్దీ ఎక్కువ. అదే సమయంలో అధిక సంఖ్యలో భక్తులు బారులుతీరే రూ.500 రాహుకేతు మండపం ఎదురుగా ఉన్న అంజి అంజి వినాయక స్వామి సన్నిధిలో కార్యక్రమం జరిగింది. మండలి సభ్యులకు చెందినవారు, ప్రముఖులు, స్థానిక నేతలు ఒకేసారి అక్కడికి రావడంతో సుమారు 3 గంటల పాటు క్యూలైన్లు స్తంభించిపోయాయి. ఇక, మంత్రి నాదెండ్ల మనోహర్ వాహనం నాలుగో గేటు వద్ద చిక్కుకుపోవడంతో ఆయన పరిపాలన భవనం చేరుకోవడానికి రద్దీలో ఇబ్బంది పడ్డారు. గంటలతరబడి క్యూలైన్లలో భక్తులు, వృద్ధులు, చంటిబిడ్డలతో అవస్థలు పడ్డారు. ఆగమ నియమానికి విరుద్ధంగా మూలమూర్తులకు సమర్పించే నైవేద్యం ఆలస్యమైందంటూ భక్తులు సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

సమన్వయం పాటించని ఛైర్మన్

జనసేన నేత కొట్టే సాయిప్రసాద్‌ను ఛైర్మన్‌గా, మరో 15మంది సభ్యులుగా, మరొకరిని ప్రత్యేక ఆహ్వానితులుగా వివిధ నియోజకవర్గాల నుంచి తొలిసారి నియమించారు. సహచర సభ్యులతో సమన్వయం పాటించడంలో సాయి విఫలమయ్యారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ, టీడీపీ సభ్యులు రెండు రోజుల క్రితం వేర్వేరుగా ప్రమాణ స్వీకారం చేయడం గమనార్హం. ఆదివారం కూడా సీనియర్లతో సమన్వయం లేకుండా ర్యాలీలు, ఫ్లెక్సీలు వేశారన్న విమర్శలున్నాయి.



ఛైర్మన్ కొట్టే సాయిని అభినందిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం: కలెక్టర్



దైవాలదిబ్బ వద్ద స్వర్ణముఖి పొర్లుకట్టలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

కోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సముద్రతీరప్రాంత గ్రామాల ప్రజలు అధైర్యపడొద్దని, అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కోట మండలం దొరువుకట్ట, దైవాలదిబ్బ గ్రామాల్లో బలహీనంగా ఉన్న స్వర్ణముఖి పొర్లుకట్టలను ఆదివారం కలెక్టర్ రైతులతో కలిసి పరిశీలించారు. ఆయా గ్రామాల్లో స్వర్ణముఖినది కట్టలిన్ని పూర్తిగా బలహీనపడి ఉన్నాయని, నదిలో వరదనీరు ఎక్కువైతే కట్టలు తెగిపోయి గ్రామాలన్నీ నీట మునిగే ప్రమాదం ఉందని ఆయకట్టు రైతులు చిల్లకూరు దశరథరామిరెడ్డి, దువ్వూరు గోవర్ధన్‌రెడ్డి, దువ్వూరు రమణారెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముంపునకు గురయ్యే గ్రామాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వసతిసౌకర్యాలు కల్పించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. జనవరి 5లోగా స్వర్ణముఖినది పొర్లుకట్టలకు మరమ్మతులు చేపడుతామన్నారు. కలెక్టర్ వెంట గూడూరు ఇన్‌ఛార్జ్ ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జునరావు, ఇరిగేషన్ ఏఈ మునిరత్నం, పలుశాఖల అధికారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేతకు గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పెళ్లకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితులుగా నియమితులైన చాగణం శైలజ ప్రమాణ స్వీకారానికి వెళ్లి వస్తూ ఓ టీడీపీ నేత వల్లూరు సూర్యప్రకాశ్‌రావు కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. సూర్యప్రకాశ్‌రావు కుమార్తె చాగణం శైలజ శ్రీకాళహస్తి ఆలయంలో ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి సూర్యప్రకాశ్‌రావు ఆయన కుమారుడు మురళీధర్‌రావు, కోడలు మల్లిక, వారి సమీప బంధువైన మరో యువతి కారులో వెళ్లారు. తిరిగి వస్తుండగా పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి వద్ద 71వ జాతీయ రహదారిపై ముందువెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా తిరిగింది. ఆ కారును సూర్యప్రకాశ్‌రావు కుటుంబ సభ్యులు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సూర్యప్రకాశ్‌రావు, ఆయన కోడలు మల్లిక గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ హయాంలోనే కల్తీ మద్యం తయారీ: నెలవల



నవ గ్రహాల మండపానికి భూమి పూజ చేస్తున్న నెలవల

పెళ్లకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలోనే కల్తీ మద్యం తయారీ ప్రారంభమయిందని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌ఛార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు ఆదివారం ఆయన తాళ్వాయిపాడు గ్రామంలోని శివాలయంలో నూతనంగా నిర్మించనున్న నవగ్రహాల మండపానికి భూమిపూజ చేశారు. అనంతరం ఇటీవల గాయపడిన గ్రామానికి చెందిన ఏఎంసీ ఉపాధ్యక్షుడు కిలారి గోపిని పరామర్శించారు. ఈ సందర్భంగా నెలవల మీడియాతో మాట్లాడుతూ కల్తీ మద్యం పై మాజీ సీఎం జగన్ మాటలకు ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పారిశ్రామికవేత్తలను తరిమికొట్టిన జగన్ గూగుల్ డేటా సెంటరుపై తానే తెచ్చినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 18 నెలల్లోనే విశాఖకు గూగుల్ డేటా సెంటర్‌ను తీసుకొచ్చిన ఘనత సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నంది కృష్ణయ్య, నాయకులు పసల గంగాప్రసాద్, మదనమోహన్ నాయుడు, నెలవల్లి సిద్ధయ్య నాయుడు, కన్నడి శ్రీనివాసులు, కానూరు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

గూడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం అధికంగా ఉండనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించడంతో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు నష్టం వాటిల్లకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

గొర్రెల కాపరిని చితకబాదిన పోలీసులు

బాధితుడిని స్టేషన్‌కు తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు

తప్పు మాదే, డబ్బులిస్తాం.. మంచి ఆస్పత్రిలో చూపించుకోండి

సూళ్లూరుపేట ఎస్ఐ బ్రహ్మనాయుడు ఉచిత సలహా

సూళ్లూరుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అటవీ భూముల్లో గొర్రెలు మేపుకుంటున్న వ్యక్తిని పోలీసులు చితకబాదిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు వివరాలు... శనివారం సూళ్లూరుపేట పోలీసులు పడమటి పట్టెలు ఉగ్గుముడి, దామానెల్లూరు, మతకముడి గ్రామాల పొలిమేరల్లో పేకాట స్థావరాలపై దాడులు చేసేందుకు మఫ్టీలో వెళ్లారు. అదే సమయంలో దామానెల్లూరుకు చెందిన ముద్దాల వెంకటేశ్వర్లు ఉగ్గుముడి అటవీ భూముల్లో గొర్రెలను మేపుతున్నాడు. మఫ్టీలో ఉన్న పోలీసులను చూసి భయపడిన వెంకటేశ్వర్లు కేకలు వేశారు. పోలీసులు వెంటనే ఆయనను పట్టుకుని ఈ ప్రాంతంలో పేకాట ఎక్కడ ఆడుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. తనకు తెలియదని చెప్పినా పోలీసులు వినిపించుకోకుండా వెంకటేశ్వర్లును లాఠీలతో చితకబాదారు. తీవ్ర గాయాలు పాలైన వెంకటేశ్వర్లును పోలీసులు దామానెల్లూరు గ్రామ సమీపంలో వదిలి రూ.400 చేతిలో పెట్టి ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోమని చెప్పి వెళ్లిపోయారు. గాయాలతో బాధపడుతున్న వెంకటేశ్వర్లును కుటుంబసభ్యులు బీఎన్ కండ్రిగలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. శరీరంపై వాతలు పడి, చర్మం కమిలిపోయి నడవలేని పరిస్థితిలో ఉన్న బాధితుని కుటుంబ సభ్యులు ఆదివారం ఆటోలో సూళ్లూరుపేట పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. సీఐ లేకపోవడంతో ఎస్ఐ బ్రహ్మనాయుడిని కలిశారు. గొర్రెలు మేపుకుని జీవనం సాగించే వెంకటేశ్వర్లును పోలీసులు అకారణంగా చితక బాదారని, కాళ్లు, చేతులు, శరీరంపై చర్మం వాచిపోయేలా చితకబాదారని ఆరోపించారు. పోలీసుల తప్పని, డబ్బులిస్తాం.. మంచి ఆస్పత్రిలో చికిత్స చేయించుకోండంటూ ఎస్ఐ బ్రహ్మనాయుడు ఉచిత సలహా ఇచ్చి పంపించేశారు. తన అన్యాయం కుమారుల్లో ముగ్గురు చనిపోయారని, ఉన్న ఒక్క కుమారుడిని కూడా పోలీసులు చితకబాది నడవలేని పరిస్థితికి తెచ్చారంటూ వెంకటేశ్వర్లు తల్లి కిష్టమ్మ కన్నీరుమున్నీరైంది.

టీడీపీలోకి దక్కిలి ఎంపీపీ!

దక్కిలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దక్కిలి ఎంపీపీ గోను రాజశేఖర్ టీడీపీ గూటికి చేరేందుకు సమాయత్తం అయినట్లు సమాచారం. ఆదివారం వెంకటగిరికి వచ్చిన ప్రముఖ పారిశ్రామిక వేత్త గంగాప్రసాద్, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌లను కలిసి భవిష్యత్ రాజకీయాలపై చర్చించినట్లు తెలిసింది. ప్రస్తుతం కాళీ పదవులలో ఉన్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తిరిగి వచ్చాక టీడీపీలో చేర్చుకుంటామని గంగాప్రసాద్ హామీ ఇచ్చినట్లు సమాచారం. కాగా, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు దక్కిలి ఎంపీపీ గోను రాజశేఖర్ సమీప బంధువు కావడంతో టీడీపీలో చేరికకు గ్రీన్ సిగ్నల్ లభించిందనట్లేనని సమాచారం.



గంగాప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోను రాజశేఖర్, పక్కన ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్





గూడూరు మండలంలోని వేములపాళెం, చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెం చప్టాలపై ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్‌ఫొటోలు)

హైలెవెల్ వంతెనల నిర్మాణం కలేనా?

వరదలొస్తే జలదిగ్బంధంలో గ్రామాలు

గూడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో లోలెవెల్ చప్టాలపై వరదనీరు ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోతున్నాయి. ఏళ్ల తరబడి ఇదే తంతు కొనసాగుతున్నా ఇప్పటి వరకు హైలెవెల్ వంతెనల నిర్మాణానికి నోచుకోకపోవడంతో ప్రజలు అవస్థలు పడాల్సివస్తోంది. తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే చప్టాలపై వరదనీరు 6 అడుగుల మేర ప్రవహిస్తుండడంతో జలదిగ్బంధంలో చిక్కుకున్న గ్రామాలకు సహాయక సిబ్బంది పడవల్లో వెళ్లి ఆహారం అందించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. అంతేకాకుండా జలదిగ్బంధంలో చిక్కుకున్న సమయంలో గ్రామాల్లో ఎవరైనా తీవ్ర అస్వస్థతకు లోనైతే వారిని చికిత్స నిమిత్తం తరలించేందుకు ఆపసోపాలు పడాల్సివస్తోంది.

గూడూరు మండలం వేములపాళెం సమీపంలోని చప్టాపై వరదనీరు ప్రవహిస్తే విందూరు, రామలింగాపురం, చెంబడిపాళెం, సంతరామపల్లి, ఈదలపల్లి, మిట్టాత్మకూరు తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెం సమీపంలోని చప్టాపైకి వరదనీరు చేరుకుంటే ఆ గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుపోతుంది. పడవల సాయంతో గ్రామస్థులకు ఆహార పదార్థాలు అందించాల్సిందే. వాకాడు మండలం గంగన్నపాళెం వద్ద చప్టాపై నీరు చేరితే పామంజి, వాళ్లేడు, జమీన్ కొత్తపాళెం తదితర 15పైగా గ్రామాలు, పంబలి సమీపంలోని చప్టాపై నీరు ప్రవహిస్తే కాశీవాకం, శ్రీనివాసపురం తదితర ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి తీరప్రాంతాల ప్రజలు అవస్థలు పడాల్సివస్తోంది. కోట మండలంలోని గోవిందపల్లిపాళెం, పుచ్చలపల్లి వెళ్లే మార్గాల్లోని చప్టాల పరిస్థితి కూడా ఇలాగే ఉండడంతో ఐదుకు పైగా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సివస్తోంది. చిట్టమూరు మండలం కొత్తగుంట మార్గంలోని చప్టాపై రొయ్యల కాలువ పొంగి ప్రవహిస్తుండడంతో మల్లాం, నాయుడుపేట మార్గాల్లో రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో మల్లాం, వల్లిపల్లి, కొక్కుపాడు తదితర ఐదు గ్రామాలకు పైగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఇకనైనా అధికారులు స్పందించి వరద సమయంలో చప్టాలపై ఇబ్బందులు కలుగకుండా హైలెవెల్ వంతెనలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన మద్యం: నెలవల

నాయుడుపేట టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పారదర్శకంగా, నాణ్యమైన మద్యం విక్రయించడం జరుగుతోందని మాజీ ఎంపీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పొదు సమీపంలో ఉన్న ఓ మద్యం దుకాణం వద్ద ఆదివారం ఎక్సైజ్ సీఐలు అరుణకుమారి, బాలకృష్ణ ఆధ్వర్యంలో సురక్షయాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఆటవిక పాలన కొనసాగిందన్నారు. జే బ్రాండ్‌లను తీసుకొచ్చి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడారని విమర్శించారు. ఎక్సైజ్ సీఐ అరుణకుమారి మాట్లాడుతూ దుకాణంలో మద్యం విక్రయించే సమయంలో బాటిల్‌ను సురక్షయాప్‌లో స్కాన్ చేసి ఇచ్చే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ గంగాధర్, టీడీపీ నాయకులు రఫీ, పల్లమాల రామిరెడ్డి, అరవపెరిమిడి చంద్రారెడ్డి, పసల గంగాప్రసాద్, నానాబాల సుబ్బారావు, నారాయణ, రవి, నంది కృష్ణయ్య, ముత్యాలయ్య, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, చెంగయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



సురక్ష యాప్‌పై అవగాహన కార్యక్రమంలో నెలవల, ఎక్సైజ్ అధికారులు, టీడీపీ నేతలు

కల్తీ మద్యం పాపం వైసీపీదే



కార్యక్రమంలో కూటమి నేతలు, ఎక్సైజ్ అధికారులు

వెంకటగిరి టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో నకిలీ, కల్తీ మద్యం విక్రయించి ప్రజల ప్రాణాలను హరించిన వైసీపీ నేతలు ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నారని ఏఎంసీ చైర్మన్ ఘనుగోటి విశ్వనాధం అన్నారు. ఆదివారం స్థానిక క్రాస్ రోడ్డు వద్ద ఎక్సైజ్ సురక్షయాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మద్యం అమ్మకాల విషయంలో పారదర్శకంగా ఉందన్నారు. ప్రతి మద్యం బాటిల్‌ను సురక్ష యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కా చేసి అమ్మకాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరం, కేవీ భాస్కర్, ఆవ్వారు సత్యనారాయణ, శ్రీనివాసులు, చంద్రమౌళిరెడ్డి, కోటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అడవయ్యకాలనీలో కార్డెన్ సెర్చ్

గూడూరు అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని అడవయ్య కాలనీ ప్రాంతంలో ఆదివారం పోలీసులు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 11 మోటారు బైకులను, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ నేరాలను నియంత్రించేందుకు కార్డన్ సెర్చ్ చేపట్టామన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తుల సంచారం ఉన్నా, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ పట్టణ కార్యదర్శి కాలేషా మృతి

గూడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పట్టణ కార్యదర్శి కాలేషా అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, నాయకులు హరినాథ్‌రెడ్డి, రామా నాయుడు, మురళి, ప్రభాకర్, నాయకులు సీపీఐ కుమార్, నారాయణ, మెంటేశ్వర్లు, జమాలుల్లా తదితరులు సంతాపం తెలిపారు.



కాలేషా (ఫైల్‌ఫొటో)

జనసేన బలోపేతానికి కలిసికట్టుగా కృషి

పార్టీ నేతలతో మంత్రి నాదెండ్ల



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

తిరుపతి అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అంతర్గత విభేదాలను పక్కనపెట్టి కలిసి కట్టుగా పనిచేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పార్టీ నాయకులను సూచించారు. ఆదివారం ఆయన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇంట్లో ఎమ్మెల్యే ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షుడు డాక్టర్.పి.హరిప్రసాద్, నగర అధ్యక్షుడు రాజారెడ్డిలతో వివిధ అంశాలపై చర్చించారు. గ్రూపు రాజకీయాలు చేస్తే ఎవరిపైనైనా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించినట్లు సమాచారం. ఎమ్మెల్యేకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. త్వరలో చేపట్టనున్న పార్టీ సభ్యత్వ నమోదులో ఉమ్మడి చిత్తూరు జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నారు. పార్టీ సాంకేతిక విభాగం, వీరమహిళలు, పవన్‌కళ్యాణ్ అభిమానులను కార్యకర్తలుగా మలుచుకోవడంపై దృష్టి సారించాలన్నారు. కొత్తవారు అనంతపురం చెందకుండా సీనియర్లను కలుపుకొని పోవాలన్నారు. కొత్త మున్సిపల్ భవనం త్వరగా పూర్తిచేసేలా, ఇంటర్ మోడల్ బస్సుస్టేషన్ నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ విస్తరణ, రెయిన్ వాటర్ స్టోరేజ్ కల్వర్టుల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం పార్టీ నాయకులు, జనసేన కార్పొరేటర్లను, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణను ఎమ్మెల్యే మిఠాయిలు పంచారు.

ఆ చైన్ స్నాచర్లు ఢిల్లీ ముఠాయేనా...

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఈస్ట్ పరిధిలో ఒకే రోజు నలుగురు మహిళల మెడల నుంచి బంగారు చైన్లు లాక్కెళ్లిన దొంగలకోసం పోలీసులు ఢిల్లీకి పయనమవుతున్నారు. పాత కార్పొరేషన్ రోడ్డు, శివజ్యోతినగర్, మధురానగర్, తిలక్ రోడ్డు, బైరాగిపట్టెడ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి ద్విచక్రవాహనం దొంగిలించి ఆ వాహనం ద్వారా చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నట్లు సీసీ ఫుటేజీల ఆధారంగా గుర్తించారు. వారి కోసం ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశారు. దొంగలు ఢిల్లీ బ్యాచ్‌గా పోలీసులు గుర్తించారు. ఇద్దరు ప్రధాన నిందితులు కాగా వీరి వెనుక మరో నలుగురు సూత్రధారులున్నట్టు భావిస్తున్నారు. ఢిల్లీ పోలీసుల సహకారంతో దొంగలను పట్టుకునేందుకు రెండు, మూడు రోజుల్లో పోలీసు బృందాలు అక్కడకు వెళ్లనున్నాయి.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీల చోరీ

తడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెండ్లూరుపాడు దళితవాడలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను దొంగలు చోరీ చేశారు. శనివారం రాత్రి యధావిధిగా ఆలయ పూజారి తలుపులు వేసి తాళాలు వేసి వెళ్లారు. ఆదివారం ఉదయం ఆలయానికి రాగా గుడి తాళాలు పగలగొట్టి హుండీలను ఎత్తుకెళ్లి ఉండడంతో గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - నరసారెడ్డికండ్రిగ జాతీయ రహదారి సమీపంలో ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీకాళహస్తి పట్టణం ఆగ్రహారానికి చెందిన కోటేశ్వరావు కోట గ్రామానికి వెళ్లాడు. శనివారం అర్ధరాత్రి శ్రీకాళహస్తికి ఆటోలో వెళ్తుండగా మార్గమధ్యంలో నరసారెడ్డికండ్రిగ వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కోటేశ్వరావుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా హరికృష్ణ



వెంకటగిరిటౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా టెలికం డిస్ట్రిక్ట్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా వెంకటగిరికి చెందిన చిట్టేటి హరికృష్ణను నియమిస్తూ బీఎస్ఎన్ఎల్ జిల్లా ప్రిన్సిపల్ మేనేజర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

దక్షణామూర్తి విగ్రహ ప్రతిష్ట పూజలు



గూడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక త్యాగరాజవీధిలోని మీనాక్షీదేవి సమేత సోమేశ్వర ఆలయంలో ఆదివారం నూతనంగా దక్షణామూర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. స్వామివారికి హోమ పూజలు, పూర్ణాహుతి పూజలు జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలను స్వీకరించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురిరెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండి శ్రీనివాసులురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చిల్లకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం అధికంగా ఉండనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. ముఖ్యంగా తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సముద్రంలోకి మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు.

గ్రేటర్‌పై వైసీపీ దుష్ప్రచారం

నరసింహయాదవ్, ఆర్సీ మునికృష్ణ



మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్, ఆర్సీ మునికృష్ణ

తిరుపతి(ఎంఆర్‌పల్లి), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిని అభివృద్ధి పథంలో తీసుకెళ్లే ఉద్దేశంతో గ్రేటర్ తిరుపతికి కూటమి ప్రభుత్వం ప్రతిపాదించిందని టీటీడీ ఆర్సీ మునికృష్ణ వైస్ చైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణలతో అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నరసింహయాదవ్ మాట్లాడుతూ ఇటీవల కార్పొరేషన్ సమావేశంలో గ్రేటర్ తిరుపతికి ఆమోదం చెబుతున్నట్లు వైసీపీ కార్పొరేటర్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు వ్యతిరేకించడం సరికాదన్నారు. గ్రేటర్ స్థాయి నగరంగా అభివృద్ధి చేయాలనుకుంటున్నామన్నారు. నలుగురు ఎమ్మెల్యేలతో చర్చించి గ్రేటర్ తిరుపతికి సలహాలు తీసుకుంటున్నామని తెలిపారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లు తామే వేశామని వైసీపీ టీడీఆర్ బాండ్ల కుంభకోణం అంతా నంపాదించుకుని ఎద్దేవా చేశారు. ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ తిరుపతిలో అభివృద్ధి టీడీపీ ఘణమేనన్నారు. గత వైసీపీ హయాంలో నగరం ఏమాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. గ్రేటర్ తిరుపతి కూటమితోనే సాధ్యమని స్పష్టం చేశారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



దగ్ధమైన పూరిల్లు

గూడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోటుపాళెం గ్రామంలో ఆదివారం షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైంది. అగ్నిమాపకశాఖ సిబ్బంది వివరాల మేరకు.. మండలంలోని పోటుపాళెం గ్రామంలో సుబ్బయ్యకు చెందిన పూరింట్లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో గృహోపకరణాలతో పాటు పలు వస్తువులు కాలిపోవడంతో రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

మెరుగైన పీఆర్సీ కోసం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కె.నాగప్రసాద్

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) ఇంజనీర్ల సమస్యలను ఐక్య మత్యంతో పోరాడి సాధించుకుందామని ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శ్యామ్ లీల్, కె.నాగప్రసాద్, కె.వి.రామారావు, డి.నాగరాజు అన్నారు. తిరుపతిలోని కల్యాణ ఆడిటోరియంలో ఆదివారం అసోసియేషన్ రాష్ట్రకమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీఆర్సీతో పెండింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కరించుకున్నామన్నారు. రానున్న పీఆర్సీ మరింత మెరుగ్గా సాధించుకోవడానికి సంఘం కృషి చేస్తుందన్నారు. ఏతల ఖాళీల భర్తీపై యాజమాన్యంతో చర్యలు జరుపుతున్నామని చెప్పారు. నాగప్రసాద్‌తో పాటు సదరన్ డిస్కం నాయకులు పూల బాలాజీ, వీరమోహ్, పీఐవోరుకుమార్‌లు ప్రసంగించారు. అనంతరం రాష్ట్ర నాయకులను డిస్కం నాయకులు సత్కరించారు. సమావేశంలో నాయకులు కృష్ణప్రసాద్, లక్ష్మణ్‌రావు, కె.జయప్రకాశ్, మునిప్రసాద్, ఆంజనేయులు, రమేశ్, సతీశ్ వెంకటలక్ష్మి, స్వాతితో పాటు సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, సినీ హీరో సుధీర్‌బాబు, నటి సురేఖావాణి, ఆమె కుమార్తె, నటి సుప్రీత, నటుడు, దర్శకుడు బలగం వేణు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.58 కోట్లు లభించింది.